News Daily
ఎడిటర్ : B. ఉపేందర్
cknews7484@gmail.com
Visit in : www.cknewstv.in

# CK NEWS
చంద్రకాంత్
తెలుగు దినపత్రిక

Website cknewstv.in

సంపుటి : 03 | సంచిక :7 | ఖమ్మం | మంగళవారం ఫిబ్రవరి 25, 2025 | CK NEWS | పేజీలు : 08

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar. Rangareddy, Medak, Adilabad


## ఎక్కడున్నారో.. ఎలా ఉన్నారో..

- గల్లంతైన వారి కోసం ముమ్మరంగా ప్రయత్నాలు
- బురదలో కూరుకుపోయారన్న అనుమానాలు
- టీబీఎం లోపలి భాగం వైపు అన్వేషణ



శ్రీశైలం ఎడమగట్టు కాలువ (ఎస్ఎల్‌బీసీ) సొరంగం ప్రమాదంలో చిక్కుకున్న ఎనిమిది మంది జాడ.. మూడు రోజులు గడిచినా తెలియరాలేదు. నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం దోమలపెంట శివారులో ఉన్న ఈ ప్రాజెక్టు పనుల్లో శనివారం ఉదయం సొరంగం పైకప్పు కూలిన ఘటనలో వారు గల్లంతైన విషయం తెలిసిందే. లోపల చిక్కుకున్న వారు ఎక్కడున్నారో.. ఎలా ఉన్నారో అనే ఉత్కంఠ తారస్థాయికి చేరింది. వారు బురదలో కూరుకుపోయి ఉంటారనే భయంతో ఆఖరి ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. బాధితులు సొరంగం చివరి పాయింట్ వద్ద విధులు నిర్వర్తిస్తుండగా ఒక్కసారిగా బురద, నీళ్లు కుమ్మరించినట్లు పడ్డాయి. బాధితులు సురక్షితంగా ఉన్నారనే ఆశాభావంతోనే సైన్యం, ఎన్‌డీఆర్ఎఫ్ దళాలు రక్షణ చర్యలను ముమ్మరం చేశాయి. సోమవారం సొరంగం లోపలి వరకు చొచ్చుకెళ్లాయి. కానీ టన్నెల్ బోరింగ్ యంత్రం (టీబీఎం) ఉన్న చోటుకు మాత్రం సిబ్బంది వెళ్లలేకపోతున్నారు. చివరన ఉన్న 40 మీటర్ల మేర ప్రదేశమంతా పూర్తిగా పూడికతో నిండిపోవడమే దీనికి కారణం. బురద, ఒంద్రు దాదాపు 15 అడుగుల ఎత్తున పేరుకుపోవడంతో చివరి వరకు చేరుకోవడం అత్యంత క్లిష్టంగా మారింది. ప్రమాదస్థలమైన 14వ కిలోమీటరు కంటే ముందు అరకిలోమీటరు దూరం వరకు మేటలు వేసిన బురదను

వివరాలు 2లో..



## భారాసను కాపాడుతోంది భాజపానే

**ఫాంహౌస్‌లో కూసోని ప్రభుత్వంపై కుట్రలు.. కేసీఆర్ తీరుపై సీఎం రేవంత్ రెడ్డి ఫైర్**

- ఫోన్ ట్యాపింగ్ కేసుపై సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపణ
- రాష్ట్రానికి నిధులు రాకుండా కిషన్‌రెడ్డి అడ్డుపడుతున్నారు
- కమలం, గులాబి పార్టీల మధ్య చీకటి ఒప్పందం
- ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార సభల్లో ముఖ్యమంత్రి విమర్శలు
- బీసీగణనలో తమ లెక్కలు తప్పని నిరూపిస్తే ముక్కు నేలకు రాస్తానని స్పష్టీకరణ
- పనితీరును చూసి ఓట్లేయాలని పట్టభద్రులకు పిలుపు

వివరాలు 2లో..

దేశంలో ఏడాదికి రెండు కోట్ల ప్రభుత్వ ఉద్యోగాలిస్తామని యువతను మభ్యపెట్టి కేంద్రంలో పగ్గాలు చేపట్టిన ప్రధాని నరేంద్రమోదీ తెలంగాణలో రెండే ఉద్యోగాలిచ్చారు. వాటిలో ఒకటి బండి సంజయ్‌కి, మరొకటి కిషన్‌రెడ్డికి దక్కాయి. అదే మేం అధికారంలోకి వచ్చిన 10 నెలల్లోనే రాష్ట్రంలోని 55,163 మంది నిరుద్యోగులకు ఉద్యోగాలిచ్చాం.
సీఎం రేవంత్‌రెడ్డి

## ఏపీ ఫైబర్‌నెట్ ఛైర్మన్ పదవికి జీవీరెడ్డి రాజీనామా

- ఆమోదించిన సీఎం చంద్రబాబు
- ఫైబర్‌నెట్ ఎండీ దినేష్‌కుమార్‌కు స్థానచలనం



ఏపీ ఫైబర్‌నెట్ లిమిటెడ్ ఎండీ దినేష్‌కుమార్‌పై తీవ్ర ఆరోపణలు చేయడం, తదనంతర పరిణామాల నేపథ్యంలో ఆ సంస్థ ఛైర్మన్ పదవికి జీవీ రెడ్డి

వివరాలు 2లో..

## అది సూపర్ ఫుడ్.. ఏడాదిలో 300 రోజులు తీసుకుంటా



మఖానా సూపర్ ఫుడ్ అని, అది ఆరోగ్యానికి ఎంతో ప్రయోజనకారి అని ప్రధాని నరేంద్రమోదీ అన్నారు. 365 రోజుల్లో 300 రోజులు అది తన ఆహారంలో భాగమయ్యేలా చూసుకుంటా నని వెల్లడించారు.

వివరాలు 2లో..

## ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మూడో స్థానం వస్తుంది



- ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటమి తప్పదని జోస్యం
- ఓడినా, గెలిచినా పోయేదేమి లేనప్పుడు ప్రచారానికి ఎందుకొచ్చారని ప్రశ్న
- గత ప్రభుత్వం కుంభకోణాల కేసులను సీబీఐకి అప్పగించాలని డిమాండ్

వివరాలు 2లో..


ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మూడో స్థానమే వస్తుందని సర్వేలన్నీ తేల్చేశాయని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో

## తెలుగు రాష్ట్రాల్లో మళ్లీ ఎమ్మెల్సీ ఎన్నికలు

### షెడ్యూల్ ఖరారు చేసిన కేంద్ర ఎన్నికల సంఘం

: తెలుగు రాష్ట్రాల్లో ఎమ్మెల్సీ ఎన్నికలకు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్‌ను ఖరారు చేసింది. ఎమ్మెల్యే కోటాలో జరగనున్న ఈ ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్‌ను సోమవారం కేంద్ర ఎన్నికల సంఘం విడుదల చేసింది. ఆంధ్రప్రదేశ్‌లో ఐదు, తెలంగాణలో ఐదు ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఆ క్రమంలో మార్చి 3వ తేదీన ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్‌ను కేంద్ర ఎన్నికల సంఘం విడుదల చేయనుంది. నామినేషన్ దాఖలుకు మార్చి 10వ తేదీ ఆఖరుగా నిర్ణయించారు. అలాగే మార్చి 11వ తేదీన దాఖలైన నామినేషన్లను పరిశీలిస్తారు. అయితే నామినేషన్లు ఉపసంహరణకు గడువు మార్చి 13వ తేదీగా నిర్ణయించింది. మార్చి 20వ తేదీ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరగనుంది. అదే రోజు సాయంత్రం 5 గంటలకు ఓట్ల లెక్కింపు.. అనంతరం ఫలితాలు వెలువడనున్నాయి.

వివరాలు 2లో..




## తొలి ప్రాధాన్యత ఓట్లతోనే కూటమి అభ్యర్థులు గెలవాలి



- ఈ నెల 27న ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్
- నేడు ఉండవల్లి నివాసంలో నారా లోకేశ్ సమీక్ష
- ప్రచారానికి అతి తక్కువ సమయం ఉందని వెల్లడి
- టెక్నాలజీ వాడుకుని ఓటరుకు చేరువ కావాలని సూచన

వివరాలు 2లో..

## మేడిగడ్డ బ్యారేజీ కుంగిన వ్యవహారంలో కేసీఆర్, హరీశ్ రావు పిటిషన్‌పై తీర్పు రిజర్వ్



- మేడిగడ్డ కుంగిన వ్యవహారంలో కేసీఆర్, హరీశ్ రావుకు జిల్లా కోర్టు నోటీసులు
- జిల్లా కోర్టు నోటీసులపై హైకోర్టుకు వెళ్లిన కేసీఆర్, హరీశ్ రావు
- ఇరువైపుల వాదనలు పూర్తి కావడంతో తీర్పు రిజర్వ్

వివరాలు 2లో..

## జగన్ సంతకం పెట్టారు.. కానీ

- ఆ హాజరు సాంకేతికంగా పరిగణనలోకి రాదు
- సోమవారం జరిగింది గవర్నర్ ప్రసంగం మాత్రమే
- కాబట్టి సిటింగ్‌గా రికార్డుల్లోకి తీసుకోరంటున్న అసెంబ్లీ వర్గాలు



శాసనసభ్యుడిగా గతేడాది ప్రమాణ స్వీకారం చేశాక రెండోసారి సోమవారం జగన్ అసెంబ్లీకి వచ్చారు. వైకాపా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను వెంటబెట్టుకుని అసెంబ్లీ ఆవరణలోకి

వివరాలు 2లో..

## ఈ ఐదేళ్లు ప్రతిపక్ష హెూదా రాదు

### జగన్‌పై పవన్ సంచలన వ్యాఖ్యలు



వైసీపీకి ప్రతిపక్ష హెూదాపై డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. వైసీపీని ఉద్దేశించి పవన్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. ఈ 5ఏళ్ళు ప్రతిపక్ష హెూదా తమకు రాదని వైసీపీ మానసికంగా ఫిక్స్ అయితే మంచిదని పవన్ హితవు పలికారు. ఏపీ అసెంబ్లీ సమావేశాల్లో

వివరాలు 2లో..



## చంద్రబాబును చూసి రేవంత్ రెడ్డి నేర్చుకోవాలి

- మిర్చికి అధిక ధర కావాలని చంద్రబాబు ఢిల్లీలో కొట్లాడుతున్నారన్న కవిత
- రేవంత్ రెడ్డి కూడా కనీసం రూ.25 వేల మద్దతు ధర కోసం డిమాండ్ చేయాలని సూచన
- తెలంగాణ ప్రభుత్వం 'పీపీపీ' మోడ్‌లో నడుస్తోందని ఎద్దేవా

పక్క రాష్ట్రం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఢిల్లీకి వెళ్లి, అక్కడ కేంద్ర ప్రభుత్వంతో కొట్లాడి మిర్చికి అధిక ధరను కావాలని అడిగారని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రశంసించారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా ఢిల్లీకి వెళ్లి మిర్చి రైతులకు రూ. 25 వేలు కనీస మద్దతు

వివరాలు 2లో..

# భారాసను కాపాడుతోంది భాజపానే

"ఫోన్ ట్యాపింగ్ కేసులో సూత్రధారులు ప్రభాకర్‌రావు, శ్రవణ్‌రావులను కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ దాచిపెట్టారు. వారిని దేశానికి రప్పించాలని నేను స్వయంగా కేంద్రానికి లేఖ రాస్తే పట్టించుకోని సంజయ్... ఇక్కడేమో కేసీఆర్, కేటీఆర్‌లను ఎందుకు అరెస్టు చేయడం లేదని మాపై విమర్శలు చేస్తున్నారు. అమెరికాలో దాక్కున్న వాళ్లను దేశానికి రప్పిస్తే 24 గంటల్లోనే అరెస్టు చేసి జైల్లో వేస్తాం" అంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. మెదక్-నిజామాబాద్- ఆదిలాబాద్-కరీంనగర్ పట్టభద్రుల స్థానంలో ఎమ్మెల్సీగా కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డి తరఫున నిజామాబాద్, మంచిర్యాల, కరీంనగర్‌లలో సోమవారం నిర్వహించిన ప్రచార సభల్లో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఫోన్ ట్యాపింగ్, ఫార్ములా-ఈ కారు రేస్, గొర్రెల పంపిణీ పథకాలపై కేసులను అడ్డం పెట్టుకొని భాజపా బెదిరిస్తుండటంతోనే దిల్లీ వెళ్లి ఆ పార్టీ నేతలతో చీకటి ఒప్పందాలు చేసుకున్నది నిజమో? కాదో? భారాస చెప్పాలన్నారు. కుంభకోణాలపై తాము కేసులు పెడితే మధ్యలో దూరి దస్త్రాలు తీసుకెళ్లిపోయిన ఈడీ... కేటీఆర్‌ను ఎందుకు అరెస్టు చేయలేకపోతోందో వెల్లడించాలన్నారు. "భారాస పదేళ్ల పాలనలో ప్రజాప్రతినిధులు పార్టీలు మారినప్పుడు రాని ఉప ఎన్నికలు ఇప్పుడెలా వస్తాయి? ఇప్పుడూ అవే కోర్టులు... అదే స్పీకర్ వ్యవస్థ ఉన్నాయి. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో భారాస ఎందుకు పోటీ చేయడం లేదో? ఈ నెల 27న జరగనున్న ఎన్నికల్లో పట్టభద్రులైన కేసీఆర్, కేటీఆర్, కవిత, హరీశ్‌రావు ఏ పార్టీకి ఓట్లేస్తారో వెల్లడించాలి" అని సీఎం స్పష్టంచేశారు.

**నిధులెలా ఇవ్వరో చూద్దాం!**

"ఆర్ఆర్ఆర్, మూసీ సుందరీకరణ, మెట్రో విస్తరణ, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాలకు అనుమతులు, నిధులు రాకుండా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి శకునిలా అడ్డుపడుతున్నారు. 2014-19 సమయంలో ఎంపీగా పనిచేసిన నాకు... పలువురు కేంద్ర మంత్రులు, కేంద్ర ప్రభుత్వ ఉన్నతాధికారులతో పరిచయాలున్నాయి. వారే నా చెవిలో ఈ విషయం చెప్పారు. భాజపా రాష్ట్ర అధ్యక్షుడిగా, బీసీ నాయకుడిగా క్రమశిక్షణతో ఉన్న బండి సంజయ్ సీటును కిషన్‌రెడ్డి లాక్కున్నారు. బండారు దత్తాత్రేయ నియోజకవర్గమైన సికింద్రాబాద్ సీటునూ తీసుకున్నారు. అదే మా పార్టీలో పీసీసీ అధ్యక్షుడి స్థానాన్ని బీసీ బిడ్డ మహేశ్‌కుమార్‌గౌడ్‌కు కట్టబెట్టాం. రాష్ట్రం నుంచి పన్నుల రూపంలో ఒక రూపాయి వెళ్తే కేంద్రం... తెలంగాణకు 42 పైసలే తిరిగిస్తోంది. అదే బిహార్‌కు రూ.7.06, ఉత్తర్‌ప్రదేశ్‌కు రూ.3.50 ఎందుకిస్తోంది? మాపై కేంద్రానికి ఎందుకీ వివక్ష? అందుకే పట్టభద్రులను వేడుకుంటున్నా. భాజపా అభ్యర్థి గెలిస్తే మోదీ అమెరికాకు అధ్యక్షుడు కారు. అదే ఆ పార్టీని బండకేసి కొడితే... పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా వస్తుంది. మెట్రోకు నిధులొస్తాయి. కాంగ్రెస్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఓడిపోతే మా ప్రభుత్వానికి వచ్చిన నష్టమేమీ లేదు. నరేందర్‌రెడ్డిని గెలిపిస్తే నిరుద్యోగులు, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారు.

**రాష్ట్రానికి కొత్త వైభవాన్ని తెస్తున్నాం...**

భారాస నిర్లక్ష్యంతో కుప్పకూలిన రాష్ట్రానికి అభివృద్ధిపరంగా కొత్త వైభవాన్ని తీసుకొస్తున్నాం. రైతులకు రూ.21 వేల కోట్ల రుణమాఫీ చేశాం. సన్నాలకు రూ.500 బోనస్ అమలు చేశాం. రూ.7,625 కోట్లు రైతుభరోసాగా అందించాం. 35 వేల మంది ఉపాధ్యాయుల బదిలీలు చేశాం. 25 వేల మందికి పదోన్నతులిచ్చాం. ఒకటో తేదీన ఉద్యోగులకు జీతాలు వేస్తున్నాం. 65 ఐటీఐలను ఏటీసీలుగా ఉన్నతీకరించాం. మహిళలకు ఉచిత ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు, రూ.500కు రాయితీ గ్యాస్ అందిస్తున్నాం. ఒలింపిక్స్‌లో బంగారు పతకాలు వచ్చేలా మట్టిలో మాణిక్యాలను ప్రోత్సహిస్తున్నాం. నిఖత్ జరీన్, సిరాజ్, దీప్తిలకు ఉద్యోగాలతోపాటు నగదు ప్రోత్సాహకాలు అందించాం. రాష్ట్రంలోని కొందరు ఇంజినీరింగ్ విద్యార్థులకు బయట మేస్త్రీలకుంటున్న అనుభవం లేకుండా పోయింది. ఇలా అన్నానని ఎవరూ బాధపడొద్దు. ఇలాంటి ఇక్కట్లు పడొద్దనే యంగ్ ఇండియా, స్పోర్ట్స్ యూనివర్సిటీలను 60 ఎకరాల్లో రూ.600 కోట్ల కార్పస్ ఫండ్‌తో ఏర్పాటు చేస్తున్నాం. ఇవన్నీ నిజం కాదా...? కాంగ్రెస్ ప్రభుత్వ పథకాలు అమలవుతున్నాయని అనుకుంటే మా పార్టీ అభ్యర్థి నరేందర్‌రెడ్డికి ఓటేయండి. లేదని భావిస్తే ఎవరికైనా ఓట్లేసుకోండి" అని రేవంత్ పిలుపునిచ్చారు.

**వందేళ్ల సమస్యకు పరిష్కారం**

"దేశంలో పెద్ద బీసీ నరేంద్రమోదీ అని, చిన్న బీసీ బండి సంజయ్ అని ప్రకటించుకొనే భాజపా... బీసీ రిజర్వేషన్లను ఎందుకు చేయలేదు? మాలో నిజాయతీ ఉండటంతోనే వందేళ్లుగా అపరిష్కృతంగా ఉన్న కులగణన సమస్యను ఏడాదిలోనే పరిష్కరించాం. తెలంగాణలో 56.33% బీసీలున్నారని తేల్చాం. ముస్లింలను బీసీల్లో చేర్చడాన్ని బండి సంజయ్ తప్పుపడుతున్నారు. కరీంనగర్ కార్పొరేటర్‌గా ఉన్నప్పుడు ఇలా మాట్లాడితే ఆయనకు తెలియదనుకోవచ్చు. కానీ, ఇప్పుడు కేంద్ర మంత్రిగా ఉన్నారు. తన ఐఏఎస్ సెక్రటరీని అడిగి అవగాహనతో మాట్లాడాలి. ఇప్పటికే మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, గుజరాత్‌లో ముస్లింలకు బీసీ రిజర్వేషన్లు అమలు చేస్తున్నారు. మేం ఎవరి సంఖ్యనూ పెంచలేదు... తగ్గించలేదు. ఉన్న లెక్కల్ని తేల్చాం. మోదీ సర్కారు జన, కులగణనలు చేపట్టి మా లెక్కలను తప్పని నిరూపిస్తే ముక్కు నేలకు రాస్తా. దమ్ముంటే కేంద్ర ప్రభుత్వం 50% రిజర్వేషన్ పరిమితిని ఎత్తేయాలి. ప్రధాని మోదీ మందకృష్ణను ఆలింగనం చేసుకున్నాడే తప్ప.. ఎస్సీ వర్గీకరణ చేయలేదు. మందకృష్ణన్న మనోడే. కానీ, వర్గీకరణ అంశాన్ని జటిలం చేసిన భాజపా కావాలో, చిత్తశుద్ధితో సమస్యను పరిష్కరిస్తున్న మేం కావాలో ఆలోచన చేయాలి" అని సీఎం కోరారు.

# ఈ ఐదేళ్లు ప్రతిపక్ష హోదా రాదు

- మొదటి పేజి తరువాయి

ఉభయసభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగిస్తున్న సమయంలో వైసీపీ నేతలు నినాదాలు చేస్తూ.. కాసేపటికి సభ నుంచి వాకౌట్ చేశారు. దీనిపై డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ స్పందిస్తూ.. సభలో వైసీపీ వ్యవహారశైలిపై మండిపడ్డారు. సోమవారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద పవన్ మాట్లాడుతూ.. శాసనసభలో గవర్నర్ ప్రసంగం సమయంలో ప్రతిపక్ష సభ్యులు వ్యవహరించిన తీరు సరైంది కాదన్నారు. గవర్నర్‌కు ఆరోగ్యం సరిగా లేకపోయినా ప్రభుత్వ సంక్షేమ పథకాలు కార్యక్రమాల గురించి చెప్పారని తెలిపారు. ఆరోగ్యం బాగాపోయినా గవర్నర్ సభకు వచ్చి ప్రసంగిస్తే వైసీపీ అడ్డుకోవాలనుకోవటం హేయమని మండిపడ్డారు. ప్రతిపక్ష హోదా అడిగితే వచ్చేది కాదు ప్రజలు ఇస్తేనే వస్తుందన్నారు.

ఇప్పుడు అసెంబ్లీలో రెండో అతిపెద్ద పార్టీ జనసేన అని చెప్పుకొచ్చారు. జనసేన కంటే ఒక్క సీటు ఎక్కువ వచ్చినా ప్రతిపక్ష హోదా వైసీపీకి వచ్చేదన్నారు. సభలో రెండో అతిపెద్ద పార్టీ జనసేన అని వైసీపీ గుర్తించాలన్నారు. 11 సీట్లు మాత్రమే ఉన్న వైసీపీకి ప్రతిపక్ష హోదా వస్తుందని ఎలా ఊహిస్తున్నారని ప్రశ్నించారు. ఈ ఐదేళ్లలో వైసీపీకి ప్రతిపక్ష హోదా రాదు అని, అది నిశ్చయం అయిపోయిందని స్పష్టం చేశారు. ఈ 5ఏళ్ళు ప్రతిపక్ష హోదా తమకు రాదని వైసీపీ మానసికంగా ఫిక్స్ అయితే మంచిదని హితవుపలికారు. హోదా అనేది సీఎం , స్పీకర్ ఇచ్చేది కాదన్నారు. వైసీపీ హుందాగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని సూచించారు. వైసీపీ నేతలు సభకు వస్తే, ఆ పార్టీకి ఉన్న బలం బట్టి ఎంత సమయం కేటాయించాలో కేటాయిస్తారని తెలిపారు.

"డిప్యూటీ సీఎంగా నేనేమీ బ్రేక్ చేయడం లేదు. ఉదయం గవర్నర్‌ను ఆహ్వానించే సమయంలో నన్ను పిలిచినా ప్రోటోకాల్ కాదని నేను సున్నితంగా తిరస్కరించా. ఓట్లు శాతం గురించి మాట్లాడే వైసీపీ నాయకులు జర్మనీకి వెళ్లిపోవచ్చు. మన దేశ నిబంధనల మేరకు వారికి ప్రతిపక్ష హోదా సాధ్యం కాదు" అని స్పష్టం చేశారు.

సనాతన ధర్మం కోసం తమిళనాడు ప్రభుత్వం కూడా పోరాడుతోందన్నారు. వక్ఫ్ బోర్డు ఉన్నప్పుడు సనాతన ధర్మం బోర్డు ఉంటే తప్పా అని ప్రశ్నించారు. సనాతన ధర్మంపై మార్చి 14 న మాట్లాడతానని తెలిపారు. రాష్ట్రంలో మిర్చి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై సీఎంతో మాట్లాడి పరిష్కరిస్తామన్నారు. తన యూపీ పర్యటనపై వస్తున్న ఆరోపణలపై అంతగా స్పందించాల్సిన అవసరం లేదన్నారు. "వెనక ఉండి మాట్లాడటం కాదు నేరుగా ముందుకు వచ్చి మాట్లాడాలి. నేనేంటో చూపిస్తా . రాజకీయాల్లోకి వచ్చినప్పుడే అన్నిటికీ సిద్ధపడి రావాలి" అని పవన్ పేర్కొన్నారు.

# తెలుగు రాష్ట్రాల్లో మళ్లీ ఎమ్మెల్సీ ఎన్నికలు

- మొదటి పేజి తరువాయి

ఈ మొత్తం ఎన్నికల ప్రక్రియ మార్చి 24వ తేదీతో ముగియనుంది. ఈ ఏడాది మార్చి 29వ తేదీతో ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీగా ఎన్నికైన పలువురు ఎమ్మెల్సీల పదవి కాలం ముగియనుంది. ఆంధ్రప్రదేశ్‌లో జంగా కృష్ణమూర్తి, దువ్వరపు రామారావు, పరుచూరి అశోక్ బాబు, బి. తిరుమల నాయుడు, యనమల రామకృష్ణుడుతో పాటు తెలంగాణలో మహబూబ్ అలీ, సత్యవతి రాథోడ్, శేరి సుభాష్ రెడ్డి, మల్లేశం ఎగ్గే, మిర్జా రియాజుల్ హసన్‌ల పదవీ కాలం ముగిసిపోనుంది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయడం కేంద్ర ఎన్నికల సంఘానికి అనివార్యమైంది.

మరోవైపు తెలుగు రాష్ట్రాల్లో చెరో మూడు ఎమ్మెల్సీ స్థానాలకు ఫిబ్రవరి 27వ తేదీన ఎన్నికలు జరగనున్నాయి. పట్టభద్రుల కోటాలో జరుగుతున్న ఈ ఎన్నికల్లో బరిలో దిగిన అభ్యర్థులు ఇప్పటికే తన ప్రచారంలో దూసుకు పోతున్నారు. ఈ ఎన్నికల ఓట్లను మార్చి 3వ తేదీన లెక్కించనున్నారు. అదే రోజు ఈ ఎన్నికల ఫలితాలు వెలువడనున్నాయి. గతేడాది జరిగిన ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లో కూటమిలోని మూడు పార్టీలు మొత్తం164 అసెంబ్లీ స్థానాలకు గెలుచుకున్నాయి. వైసీపీకి కేవలం11 స్థానాలు మాత్రమే వచ్చాయి. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే కోటాలో జరిగే ఐదు ఎమ్మెల్సీ స్థానాలు కూటమి ఖాతాలో పడనున్నాయి. అలాగే తెలంగాణలో సైతం కాంగ్రెస్ పార్టీ అత్యధిక స్థానాలు గెలుచుకుంది. దీంతో రేవంత్ రెడ్డి సారథ్యంలో ప్రభుత్వం కొలువు తీరింది. ఇక ప్రతిపక్ష పార్టీలు బీఆర్ఎస్, బీజేపీ కొన్ని స్థానాలను గెలుచుకొన్నాయి. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీ ఎన్నికల జరిగితే ఐదు స్థానాల్లో నాలుగు స్థానాలు కాంగ్రెస్ పార్టీ ఖాతాలో పడతాయి. ఒక స్థానం బీఆర్ఎస్ పరమయ్యే అవకాశాలున్నాయన్నది సుస్పష్టం.

# ఎక్కడున్నారో.. ఎలా ఉన్నారో..

- మొదటి పేజి తరువాయి

తొలగించేందుకు రక్షక బృందాలు చర్యలు ప్రారంభించాయి. సహాయబృందాలను విపత్తు నిర్వహణశాఖ కమిషనర్ అర్వింద్‌కుమార్, ఆర్మీ మేజర్ జనరల్ అజయ్‌మిశ్రా సమన్వయం చేస్తున్నారు. పోలీసు జాగిలాన్ని కూడా వినియోగిస్తున్నారు. కొద్దిదూరం వరకు జాగిలాన్ని తీసుకెళ్లామని, నీరు ఉండటంతో తిరిగి వెనక్కి తీసుకొచ్చినట్లు అధికారులు తెలిపారు.

**బురద తొలగింపు కూడా జాగ్రత్తగానే..**

సోమవారం మధ్యాహ్నం సొరంగంలోకి వెళ్లిన ఎన్‌డీఆర్ఎఫ్, ఇతర బృందాల సభ్యులు సాయంత్రం 6.30 గంటలకు తిరిగివచ్చారు. టీబీఎం సమీపానికి వెళ్లిన వీరంతా ప్రాథమికంగా ఓ అవగాహనకు వచ్చినట్లు వెల్లడించారు. టీబీఎం 20 మీటర్ల మేర సొరంగంలో ఇరుక్కుపోయింది. ప్రమాదస్థలానికి వెళ్లేందుకు వీల్లేకుండా అడ్డంగా బురదతోపాటు నిర్మాణ సామగ్రి, టీబీఎం యంత్రం శిథిలాలు చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. మిషన్ నడిచే ట్రాక్, కన్వేయర్ బెల్టు, అక్కడ నిల్వ చేసిన చిప్స్, రాడ్లు, కాంక్రీట్ సెగ్మెంట్లు, సిమెంటు తదితర పదార్థాలు బురద మట్టితో కలిసి పేరుకుపోయాయి. బురదలో బాధితులు చిక్కుకుని ఉండవచ్చన్న అంచనాతో తొలగింపు చర్యలు కూడా చాలా జాగ్రత్తగా చేపట్టనున్నారు. దీంతోపాటు ఎన్డీఆర్ఎఫ్ బృందం పలుగు, పారలతో రంగంలోకి దిగింది. కొద్ది కొద్దిగా బురద, మట్టిని తొలగిస్తూ ముందుకు వెళ్లేందుకు ప్రయత్నిస్తోంది.

**బయటపడిన కార్మికుల్లో ఇంకా భయం**

టీబీఎం ఉన్న ప్రాంతంలో ఏ కార్మికుడు ఎటువైపు పనిచేసి ఉంటారనే విషయాన్ని నిర్ధారించడం కీలకంగా మారింది. బురద మట్టిని ఒక్క ఉదుటన తొలగించడం ప్రారంభిస్తే సమస్యలు ఉత్పన్నమవుతాయని పలు దఫాలుగా సాగిన చర్చల్లో నిర్ణయానికి వచ్చారు. ప్రమాదం నుంచి సురక్షితంగా బయటపడిన కార్మికులకు అక్కడి పరిస్థితులపై కొంత అంచనా ఉంటుంది కనుక.. సహాయచర్యల్లో భాగంగా వారిని సొరంగంలోకి తీసుకువెళ్లడం తప్పనిసరిగా మారింది. కానీ పైకప్పు కూలిన ఘటనతో కార్మికుల్లో నెలకొన్న భయం ఇంకా తొలగిపోలేదు. వారిని ఒప్పించేందుకు నీటిపారుదలశాఖ ఇంజినీర్లు, నిర్మాణ సంస్థ ప్రతినిధులు ప్రయత్నిస్తున్నారు.

# జగన్ సంతకం పెట్టారు.. కానీ

- మొదటి పేజి తరువాయి

ప్రవేశిం చారు. పోర్టికో నుంచి ప్రవేశించగానే ఎదురుగా ఎమ్మెల్యేలు సంతకాలు పెట్టేందుకు ఏర్పాటు చేసిన రిజిస్టర్‌లో ఆయన సంతకం చేశారు. తర్వాత సభలోకి వెళ్లి, కాసేపటికే బాయ్‌కాట్ చేసి ఇంటికి వెళ్లిపోయారు. '60 రోజులపాటు వరుసగా సభకు హాజరవకపోతే ఆటోమేటిక్‌గా అనర్హత వేటు పడుతుంది' అని సభాపతి, ఉప సభాపతి ఇప్పటికే అధికారికంగా ప్రకటించారు. ఈ నేపథ్యంలో జగన్ హాజరు కోసమే సోమవారం సభకు వచ్చారని అసెంబ్లీ ఆవరణలో విస్తృతచర్చ జరిగింది. జగన్ సభకు వచ్చి సంతకమైతే పెట్టి వెళ్లిపోయారు కానీ, దాన్ని హాజరుగా పరిగణించే అవకాశం లేదని అసెంబ్లీ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి.

**గవర్నర్ ప్రసంగం.. సభ సిటింగ్‌గా పరిగణించరు**

సభలో స్పీకర్ అధ్యక్షతన జరిగే సమావేశాలనే పనిదినాలు, సిటింగ్‌గా పరిగణిస్తారు. సోమవారం శాసనసభలో సమావేశమైన ఉభయ సభల (శాసనసభ, శాసనమండలి) సభ్యులను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగించారు. వేదికపై శాసనమండలి ఛైర్మన్, శాసనసభాపతి కూడా ఉన్నారు. సభకు ముగ్గురు అధ్యక్షత వహించే పరిస్థితి ఉండదు కాబట్టి, ఈ ప్రసంగాన్ని సిటింగ్ కిందకు తీసుకోరని అంటున్నారు. గవర్నర్ ప్రసంగం ముగియగానే సభ వాయిదా పడింది. గవర్నర్ ప్రసంగంపై మంగళవారం ధన్యవాద తీర్మానం చేయాల్సి ఉన్నందున, దానికి ముందుగా ఆ ప్రసంగాన్ని శాసనసభ, మండలిలో టేబుల్ చేస్తారు. అప్పుడే అది రికార్డుల్లోకి వస్తుందని అసెంబ్లీ వర్గాలు చెబుతున్నాయి. కాబట్టి సాంకేతికంగా సోమవారాన్ని సిటింగ్‌గా పరిగణించరు. ఆ రోజు సభ్యులు సంతకాలు పెట్టినా వాటిని హాజరుగా లెక్కలోకి తీసుకోరని చెబుతున్నారు. ఈ లెక్కన చూస్తే గతేడాది జూన్‌లో ప్రమాణ స్వీకారం చేశాక.. జులైలో జరిగిన సమావేశాల్లో కూడా గవర్నర్ ప్రసంగం రోజు మాత్రమే జగన్ సభకు వచ్చి ఇప్పటిలాగే సంతకం పెట్టి వెళ్లిపోయారు. ఆ సంతకం కూడా హాజరుగా పరిగణించే పరిస్థితి ఉండదనేది అసెంబ్లీ వర్గాల కథనం.

**పార్లమెంటులో మాత్రమే ఆ విధానం**

పార్లమెంటులో రాష్ట్రపతి ఉభయసభలను ఉద్దేశించి చేసే ప్రసంగం కూడా ఇక్కడ అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగంలాగే వెంటనే రికార్డుల్లోకి రాదంటున్నారు. అయితే రాష్ట్రపతి ప్రసంగం ముగిశాక కాసేపు వాయిదా వేసి.. తర్వాత రాజ్యసభ, లోక్‌సభ వేర్వేరుగా అదే రోజు సమావేశమవుతాయి. అప్పుడు రాష్ట్రపతి ప్రసంగాన్ని ఆయా సభల్లో ప్రవేశపెడతారు, కాబట్టి అది అధికారికంగా పనిదినమవుతుంది. జాయింట్ సెషన్ అనే ప్రొవిజన్ రాజ్యాంగం ప్రకారం పార్లమెంటుకే ఉందని చెబుతున్నారు. ఏదైనా బిల్లు విషయంలో లోక్‌సభ, రాజ్యసభ మధ్య విభేదం వచ్చినప్పుడు.. లోక్‌సభ స్పీకర్ అధ్యక్షతన రెండు సభలనూ కలిపి జాయింట్ సెషన్ నిర్వహించే వీలుంటుంది. అలాంటి వెసులుబాటు అసెంబ్లీకి లేదని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. కాబట్టి సోమవారం అసెంబ్లీలో జరిగినదాన్ని జాయింట్ సెషన్ (ఉభయ సభలు కలిపి) అని కాకుండా, శాసనసభలో ఉభయ సభల సభ్యుల సమావేశంగా పరిగణిస్తారని చెబుతున్నారు.

# చంద్రబాబును చూసి రేవంత్ రెడ్డి నేర్చుకోవాలి

- మొదటి పేజి తరువాయి

ధర ఇవ్వాలని కేంద్రంతో కొట్లాడాలని డిమాండ్ చేశారు.కవిత ఈరోజు మహబూబాబాద్ జిల్లాలో పర్యటించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ, చంద్రబాబును చూసి రేవంత్ రెడ్డి నేర్చుకోవాలని అన్నారు. మిర్చి పంటకు ఎకరాకు లక్షల్లో ఖర్చవుతోందని ఆమె అన్నారు. మిర్చి, పసుపు రైతుల కష్టాలపై ముఖ్యమంత్రి ఆలోచన చేయాలని సూచించారు. మిర్చి రైతులకు కనీస మద్దతు ధర రాకుంటే వారు తీవ్రంగా నష్టపోతారని ఆమె అన్నారు. తెలంగాణ ప్రభుత్వం 'పీపీపీ' మోడ్‌లో నడుస్తోందని ఎద్దేవా చేశారు. పీపీపీ అంటే ఫోబియా, పాలిటిక్స్, పర్సంటేజ్ అని చురక అంటించారు.

# ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మూడో స్థానం వస్తుంది

- మొదటి పేజి తరువాయి

కాంగ్రెస్ పార్టీకి ఓటమి తప్పదని ఆయన జోస్యం చెప్పారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు ఆశ్చర్యకరంగా ఉన్నాయని ఆయన అన్నారు. ఎన్నికల్లో ఓడినా, గెలిచినా పోయేదేమీ లేదని ముఖ్యమంత్రి అంటున్నారని, అలాంటప్పుడు ఆయన ప్రచారానికి ఎందుకు వచ్చారని ప్రశ్నించారు. ముఖ్యమంత్రికి ఓటమి భయం పట్టుకుందని అన్నారు.

గత ప్రభుత్వంలో జరిగిన అక్రమాలపై మీరు విచారణ జరుపుతూ, కేంద్ర ప్రభుత్వం అరెస్ట్ చేయాలని చెప్పడం విడ్డూరంగా ఉందని అన్నారు. బీఆర్ఎస్‌తో కాంగ్రెస్ పార్టీకి చీకటి ఒప్పందాలు ఉన్నాయని ఆరోపించారు. గత ప్రభుత్వ కుంభకోణాలను సీబీఐకి అప్పగించాలని డిమాండ్ చేశారు. అప్పుడు దోషులను లోపల వేస్తామని తేల్చి చెప్పారు.

# మేడిగడ్డ బ్యారేజీ కుంగిన వ్యవహారంలో కేసీఆర్, హరీశ్ రావు పిటిషన్‌పై తీర్పు రిజర్వ్

మేడిగడ్డ బ్యారేజీ కుంగిన వ్యవహారంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావు దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టులో విచారణ జరిగింది. పిటిషన్‌పై ఇరువైపుల వాదనలు విన్న న్యాయస్థానం తీర్పును రిజర్వ్ చేసింది. మేడిగడ్డ బ్యారేజీ కుంగిన వ్యవహారంలో రాజలింగమూర్తి అనే వ్యక్తి భూపాలపల్లి జిల్లా కోర్టులో క్రిమినల్ రివిజన్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిని విచారణకు స్వీకరిస్తూ జిల్లా కోర్టు కేసీఆర్, హరీశ్ రావుకు నోటీసులు జారీ చేసింది. జిల్లా కోర్టు నోటీసులపై కేసీఆర్, హరీశ్ రావు హైకోర్టును ఆశ్రయించారు. ఇటీవల పిటిషన్‌దారు రాజలింగమూర్తి హత్యకు గురయ్యారు. ఫిర్యాదుదారు మృతి చెందితే పిటిషన్‌కు విచారణార్హత ఏ విధంగా ఉంటుందని హైకోర్టు ప్రశ్నించింది. ఫిర్యాదుదారు మృతి చెందినా పిటిషన్‌ను విచారించవచ్చని పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాదనలు వినిపించారు. ఈ క్రమంలో, ఇరువైపుల వాదనలను విన్న న్యాయస్థానం తీర్పును రిజర్వ్ చేసింది.

# అది సూపర్ ఫుడ్.. ఏడాదిలో 300 రోజులు తీసుకుంటా

- మొదటి పేజి తరువాయి

దేశవ్యాప్తంగా ఉన్న చాలామంది ప్రజలకు అల్పాహారంలో మఖానా ఉంటుందని, అంతర్జాతీయ స్థాయిలో దాని ఉత్పత్తి ఉండాలని పేర్కొన్నారు.

సోమవారం బిహార్‌లోని భాగల్‌పుర్‌లో పర్యటించిన సందర్భంగా.. తన ఆహారపు అలవాటు గురించి చెప్పారు.రైతుల శ్రేయస్సు కోసం బిహార్‌లో మఖానా బోర్డు ఏర్పాటు చేయనున్నట్లు వార్షిక బడ్జెట్‌లో నిర్మలాసీతారామన్ ప్రకటించిన సంగతి తెలిసిందే. 'మఖానా బోర్డు ఏర్పాటుకు రూ.100 కోట్లు కేటాయిస్తున్నాం. ఈ బోర్డు ద్వారా ఉత్పత్తి, ప్రాసెసింగ్, మార్కెటింగ్ అవకాశాలు మెరుగుపడతాయి. రైతులకు శిక్షణ అందుతుంది. వారు అన్ని ప్రభుత్వ పథకాల ప్రయోజనాలనూ పొందేలా బోర్డు చూస్తుంది' అని మంత్రి వివరించారు. దీనికి గుర్తుగా భాగల్‌పుర్ కార్యక్రమంలో మోదీకి మఖానాతో చేసిన దండను వేసి గౌరవించారు.

**లాలూ వ్యాఖ్యలు.. మండిపడిన ప్రధాని**

దిల్లీ రైల్వే స్టేషన్ తొక్కిసలాట ఘటనపై బిహార్ మాజీ ముఖ్యమంత్రి లాలూ ప్రసాద్ యాదవ్  చేసి వ్యాఖ్యలను ఉద్దేశించి మోదీ ఆగ్రహం వ్యక్తంచేశారు. "ప్రయాగ్‌రాజ్‌లో కుంభమేళా  నిర్వహణలో ఐక్యత కనిపిస్తోంది. భారతదేశ అద్భుతమైన వారసత్వాన్ని కాపాడేందుకు, భవిష్యత్తు నిర్మాణం కోసం ఎన్డీయే ప్రభుత్వం అందరితో కలిసి పనిచేస్తోంది. ఆటవిక రాజ్యాన్ని ప్రోత్సహించే ఈ వ్యక్తులు మన వారసత్వాన్ని, విశ్వాసాలను ద్వేషిస్తున్నారు" అని బిహార్ పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ దుయ్యబట్టారు.కుంభమేళా కు ప్రయాణికులు పోటెత్తడంతో ఇటీవల న్యూదిల్లీ రైల్వేస్టేషన్‌లో తొక్కిసలాట ( చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. 14వ నంబరు ప్లాట్‌ఫాంపై ప్రయాగ్‌రాజ్ ఎక్స్‌ప్రెస్ నిలిచి ఉండడంతో భక్తులు అక్కడకు చేరుకున్నారు. ఇతర రైళ్లు ఆలస్యం కావడంతో వాటి కోసం వచ్చిన ప్రయాణికులు అదే సమయంలో 12, 13, 14 నంబరు ప్లాట్‌ఫాంలపై ఉన్నారు. దీంతో ఒక్కసారిగా అక్కడ రద్దీ పెరిగిపోయి తొక్కిసలాటకు దారితీసింది. ఈ ఘటనలో 18 మంది మరణించగా.. అనేక మంది గాయపడ్డారు.దీనిపై లాలూ ప్రసాద్ యాదవ్ స్పందిస్తూ.. కుంభమేళా అర్థంలేనిదని వ్యాఖ్యలు చేశారు. ఇదంతా బుజ్జగింపు రాజకీయమని ఆ విమర్శలను భాజపా తిప్పికొట్టింది. తాజాగా పీఎం స్పందించారు. ఇక ఈ ఏడాది చివర్లో బిహార్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ తరుణంలో అక్కడి రాజకీయాలు వేడెక్కాయి.

# తొలి ప్రాధాన్యత ఓట్లతోనే కూటమి అభ్యర్థులు గెలవాలి

ఉభయ గోదావరి, కృష్ణా-గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తొలి ప్రాధాన్యత ఓట్లతోనే కూటమి అభ్యర్థులు భారీ మెజారిటీతో ఘన విజయం సాధించాలని రాష్ట్ర విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికలపై పార్టీ సీనియర్ నేతలతో మంత్రి లోకేశ్ నేడు ఉండవల్లి నివాసంలో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రచారానికి అతి తక్కువ సమయం మాత్రమే ఉండటంతో టెక్నాలజీ వినియోగం ద్వారా ప్రతి ఓటరును అభ్యర్థించాలని అన్నారు. ఎన్నికల ముందు రోజు శివరాత్రి పండుగ నేపథ్యంలో ప్రతి ఓటరు పోలింగ్ బూత్ లకు వచ్చి ఓటు హక్కు వినియోగించుకునేలా ఇన్ చార్జి మంత్రులు, శాసనసభ్యులు బాధ్యత తీసుకోవాలన్నారు. ఎన్నికల రోజు పరిస్థితిని ఎప్పటికప్పుడు కేంద్ర కార్యాలయం నుంచి పర్యవేక్షించేందుకు వార్ రూమ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కూటమి నాయకులంతా కలసికట్టుగా పార్టీ అభ్యర్థుల ఘన విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్సీలు భూమిరెడ్డి రాంభూపాల్ రెడ్డి, కంచర్ల శ్రీకాంత్, వేపాడ చిరంజీవి, జోనల్ కోఆర్డినేటర్లు సుజయకృష్ణ రంగారావు, ఎం.వి సత్యనారాయణ రాజు, దామచర్ల సత్య, మందలపు రవి తదితరులు పాల్గొన్నారు.

# ఏపీ ఫైబర్‌నెట్ ఛైర్మన్ పదవికి జీవీరెడ్డి రాజీనామా

- మొదటి పేజి తరువాయి

సోమవారం రాజీనామా చేశారు. తెదేపా జాతీయ అధికార ప్రతినిధి పదవికి, పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి కూడా రాజీనామా చేస్తున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబుకు లేఖ రాశారు. 'మీరు నాపై ఉంచిన విశ్వాసానికి, అందించిన మద్దతుకు, నాకు ఈ కీలకమైన బాధ్యత నిర్వహించే అవకాశం కల్పించినందుకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. తెదేపా మరింత బలంగా ఎదిగి ప్రజాసేవలో ముందుండాలని ఆకాంక్షిస్తున్నాను. ఇకపై పూర్తిగా న్యాయవాద వృత్తిలో కొనసాగుతాను. భవిష్యత్తులో ఏ రాజకీయ పార్టీలోనూ చేరే ఉద్దేశం లేదు' అని జీవీ రెడ్డి ఆ లేఖలో పేర్కొన్నారు. ఆయన రాజీనామాను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆమోదించారు. వెంటనే ఫైబర్‌నెట్ ఎండీ, ఐఏఎస్ అధికారి దినేష్‌కుమార్‌ను బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇంతవరకు ఆయన పూర్తి అదనపు బాధ్యతగా నిర్వహిస్తున్న రియల్‌టైం గవర్నెన్స్ సొసైటీ సీఈఓ, ఏపీ గ్యాస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ ఎండీ, ఏపీ డ్రోన్ కార్పొరేషన్ ఎండీ పోస్టుల నుంచి తొలగించారు. సాధారణ పరిపాలన శాఖలో రిపోర్ట్ చేయమని ఆదేశించారు. ఆయనకు కొంతకాలంపాటు ఏ పోస్టింగ్ ఇవ్వకుండా వెయిటింగ్‌లో ఉంచబోతున్నారని సమాచారం.

# సిపిఎం పార్టీని బలోపేతం చేయడమే కామ్రేడ్ నాగేశ్వరరావుకు మనమిచ్చే ఘన నివాళి.

● ముదిగొండ 9వ వర్ధంతి సభలో నాయకుల పిలుపు..



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),ఫిబ్రవరి 24,**సిపిఎం పార్టీని బలోపేతం చేయడమే అమర జీవి కామ్రేడ్ ముదిగొండ నాగేశ్వరరావుకు మనం ఇచ్చే ఘన నివాళి అని సిపిఎం సీనియర్ నాయకులు మాజీ డిసిసిబి చైర్మన్ యలమంచి రవికుమార్, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం బి నర్సారెడ్డి లు పిలుపునిచ్చారు. సిపిఎం పార్టీ భద్రాచలం పట్టణ మాజీ కార్యదర్శి వర్గ సభ్యులు అమరజీవి కామ్రేడ్ ముదిగొండ నాగేశ్వరరావు 9వ వర్ధంతి సభ పార్టీ పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి అధ్యక్షతన జరిగింది. ముందుగా ముదిగొండ చిత్రపటానికి పార్టీ సీనియర్ నాయకులు జి.ఎస్. శంకర్రావు, బి బి జి తిలక్ లు పూలమాలవేసి నివాళులు అర్పించారు. అనంతరం జరిగిన సభలో వారు మాట్లాడుతూ కామ్రేడ్ ముదిగొండ నాగేశ్వర రావు నిత్యం ప్రజా సమస్యలపై పనిచేసేవారని , ప్రజలలో తలలో నాలికల ఉండేవారని అన్నారు. ఆనాడు ప్రజాశక్తి పత్రికను విస్తృతంగా ప్రజలలోకి తీసుకెళ్లేందుకు మంచి కృషి చేసేవారని అన్నారు. నేడు దేశంలో విలువలు లేని రాజకీయాలు రాజ్యమేలుతున్నాయని అన్నారు. దేశాన్ని పాలిస్తున్న బిజెపి ప్రజలపై భారాలు మోపి కార్పొరేట్ శక్తులకు దోచిపెడుతోందని అన్నారు. రోజురోజుకు పేదరికం ,నిరుద్యోగం, అసమానతలు పెరిగిపోతున్నాయని అన్నారు. రాష్ట్రంలో అధికారం లో ఉన్న కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయడం లో వైఫల్యం చెందుతుందని అన్నారు. రానున్న కాలంలో ప్రజా సమస్యలపై క్షేత్రస్థాయిలో ప్రజా ఉద్యమాలు నిర్వహించడం ద్వారా పార్టీని బలోపేతం చేయాలని అదే అమరజీవి కామ్రేడ్ ముదిగొండ నాగేశ్వరరావు కు మనమిచ్చే నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు పి సంతోష్ కుమార్ పట్టణ కమిటీ సభ్యులు డి రాఘవయ్య ఎస్ భూపేంద్ర ఎస్ డి ఫిరోజ్ సీనియర్ నాయకులు ఎం.వి.ఎస్ నారాయణ, మురళీకృష్ణ, జి రాధా, కుటుంబ సభ్యులు ధనలక్ష్మి, రాము తదితరులు పాల్గొన్నారు.

## రైల్వే స్టేషన్ దగ్గర శిరిడి సాయిబాబా మందిరం 32వ వార్షికోత్సవం.



**సి కె న్యూస్ మండలం ప్రతినిధి బాలరాజు ఫిబ్రవరి 24.**
యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రంలోని రైల్వే స్టేషన్ దగ్గర షిరిడి సాయిబాబా మందిరం 32వ వార్షికోత్సవం, సాయి సేవ మందిరం అధ్యక్షులు కొండూరు అంజయ్య గౌడు ఆధ్వర్యంలో.

32వ వార్షికోత్సవ%శీ% ఘనంగా నిర్వహించినారు, వచ్చిన భక్తులకు అన్నదాన%శీ% బొడిగ రాజు కుటుంబ సభ్యులు ఏర్పాటు చేసినారు, ఈ వార్షికోత్సవంలో సాయి సేవకులు డాక్టర్ దశరథ, కొండూరు సాయి కొండూరు భాస్కర్ కొండూరు నాగేష్ కుటుంబ సభ్యులు,సాయి సేవకురాలు మానస,సాయి సేవక కమిటీ సభ్యులుమండల కేంద్రంలోని సాయి భక్తులు దాదాపు 600 మంది వరకు పాల్గొని షిరిడి సాయి ఆశీస్సులు తీసుకున్నారు,మీడియాతో బొడిగె రాజు మాట్లాడుతూ అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయడం మా కుటుంబ సభ్యులకు సంతోషంగా ఉన్నదని మాట్లాడినారు,

## ఠాగూర్ శివ రతన్ సింగ్ కి బాలికలచే సన్మానం





**సీకే న్యూస్ ఫిబ్రవరి 24 హన్మకొండ జిల్లా ధర్మసాగర్ మండలం ప్రతినిధి కమలాకర్**
స్థానిక ధర్మసాగర్ మండల కేంద్రంలోని మండల పరిషత్ బాలికల పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఠాకూర్ శివ రతన్ సింగ్ ఫిబ్రవరి 28న పదవీ విరమణ చేస్తున్న సందర్భాన్ని పురస్కరించుకొని, జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలు చదువుతున్న విద్యార్థులందరూ మధ్యాహ్న భోజనం చేసేందుకు వీలుగా, అందరికీ స్టీల్ ప్లేట్ల వితరణ చేశారు వారి ఔదార్యాన్ని అభినందిస్తూ పాఠశాల విద్యార్థి ,ఉపాధ్యాయ బృందం ధన్యవాదాలు తెలిపారని ఇన్చార్జ్ ప్రధానోపాధ్యాయులు ధర్మ ప్రకాష్ తెలియజేశారు.

## బిఎస్పీ చర్ల మండల ప్రధాన కార్యదర్శి గా ఏకుల వెంకటేర్లు నియామకం.



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),ఫిబ్రవరి 24,**
బహుజన్ సమాజ్ పార్టీ చర్ల మండల ప్రధాన కార్యదర్శిగా ఏకుల వెంకటేశ్వర్లు నియమితులైనట్లు బహుజన్ సమాజ్ పార్టీ చర్ల మండల అధ్యక్షుడు కొండా కౌశిక్ సోమవారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. చర్ల మండల బిఎస్పీ కార్యాలయం లో జరిగిన కార్యక్రమం లో భాగంగా ఇటీవల పార్టీ లో చేరిన ఏకుల వెంకటేశ్వర్లుని ఆయన పార్టీకి మండల కీలక స్థానం లో సేవలందించాల్సిన అవసరం ఉందని భావించి నియమించి నట్లు తెలియజేశారు... ఈ సమావేశాని కి ముఖ్య అతిదిగా విచ్చేసిన బిఎస్పీ భద్రాచలం నియోజక వర్గ అద్యక్షుడు కొండా చరణ్ మాట్లాడుతూ ఎంబిసి లకు బహుజన్ సమాజ్ పార్టీ రాజకీయ అవకాశాలు కల్పించి రాజ్యాధికారం లో జనాభా కు తగిన వాటా ఇస్తుందని అన్నారు. బిసి, ఎస్సీ ఎస్టిలకు, మహిళలకు,మతమైనారిటీలకు జనాభాకు తగిన రాజకీయ అవకాశాలు కల్పించేందు కే సామాజిక న్యాయ అజెండా గా బహుజన్ సమాజ్ పార్టీ స్థాపించ బడిందని, భద్రాచలం నియోజకవర్గ వ్యాప్తంగా బిసి,ఎస్సి,ఎస్టి ప్రజల పెద్ద ఎత్తున పార్టీ లో చేరుతుండడం,రాష్ట్ర వ్యాప్తంగా పార్టీ కి లభిస్తున్న ఆదరణ చూస్తుంటే బహుజన రాజ్యం రాబోతోందని అనిపిస్తోందని అన్నారు.

## ఐఐటీలో 236 ర్యాంకు సాధించిన విద్యార్థినికి ఆర్థిక సహాయం.

● ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్.



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),ఫిబ్రవరి 24,**
ఐఐటీలో సీటు రాగానే అంతటితో చదువు ఆపకుండా మంచివారితో స్నేహం చేసుకొని అనుకున్నది సాధించే వరకు పట్టుదలగా చదివి జీవితంలో స్థిరపడినప్పుడే చదివిన చదువుకి సార్ధకత లభిస్తుందని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ అన్నారు.

సోమవారం తన చాంబర్లో కుసుమంచి మండలం గోరీల పాడు తండా గ్రామానికి చెందిన తేజవత్ సింధు గురుకులం కళాశాల భద్రాచలంలో ఎంపీసీ వరకు చదివి ఐఐటీలో 236 ర్యాంకు సాధించి తిరుపతి లో బీటెక్ చేయడానికి సీట్ సంపాదించిందని ఆయన అన్నారు. ఒకటవ తరగతి నుండి పదవ తరగతి వరకు సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ఖమ్మంలో చదువు కున్నదని, ఇంటర్మీడియట్ సి ఓ ఈ భద్రాచలం చదువుకొని నీట్ పరీక్ష రాసిందని ఆయన అన్నారు. తేజ వత్ సింధు తల్లిదండ్రులు లక్ష్మి, పఖీయ నిరుపేద రైతు కుటుంబంలో జన్మించిన పిల్లల చదువుల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం అభినందనీ యమని ఆయన తెలుపుతూ, మొదటి సంవత్సరం ఐఐఐటి చదవడానికి ప్రోత్సాహంగా 50 వేల రూపాయలు చెక్కు ఆమె తల్లిదండ్రులకు అందించడం జరిగిందని అన్నారు. చెక్కు బాలిక తల్లిదండ్రులకు అందిస్తూ ఖాళీ సమయంలో క్రింది తరగతి విద్యార్థిని విద్యార్థులకు తప్పనిసరిగా యొక్క ప్రతిభను వారికి తెలియజేసి చదువుపట్ల మక్కువ కలిగేలా స్ఫూర్తి నింపాలని, తల్లిదండ్రుల మీద ఆర్థిక భారం మోపకుండా నెలకు కొంత ఆర్థిక వేసులుబాటు చేసుకోవడానికి ఆన్లైన్లో ప్రైవేటుగా క్లాసులు నిర్వహించుకొని ఆర్థికంగా వెసులుబాటు కల్పించుకోవాలని అన్నారు.

ఈ కార్యక్రమంలో సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్ మరియు బాలిక తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## బి సీ గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ ని సస్పెండ్ చేయాలి.

- విద్యార్థులకు భోజనం నాణ్యమైన కరువు
- ప్రిన్సిపల్ కి వర్కర్లకు మధ్య గొడవ పరిష్కారం ఎప్పుడవును.
- ప్రిన్సిపల్ ప్రవర్తన సరిగా లేకపోవడమే సమస్యలకి నిలయంగా మారుతున్న బీసీ గురుకుల పాఠశాల.
- తక్షణమే ఉన్నతాధికారులు , జిల్లా కలెక్టర్ స్పందించాలి.



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),ఫిబ్రవరి 24,**బీసీ గురుకులన్నీ పీ డీ ఎస్ యు భద్రాచలం డివిజన్ కార్యదర్శి సందర్శించి మాట్లాడుతూ. భద్రాచలం బీసీ గురుకుల పాఠశాలలో గత ఆరు నెలల నుండి విద్యార్థులకు నానమైన భోజనాన్ని అందించకుండా కాలయాపన చేస్తున్నారని అనేక సందర్భాల్లో ఉన్నతాధికారుల కు చెప్పిన పట్టించుకోకుండా వివరించడం వల్ల పదేపదే అదే సమస్య తలెత్తుతుందని ఆయన అన్నారు. మెనూ పాటించకుండా సమయానికి భోజనం పెట్టకుండా ప్రిన్సిపల్ వివరిస్తుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులకు ఉడికి ఉడకని అన్నం ముద్దలు ముద్దలుగా ఉడికిన అన్నాన్ని పెడుతూ రుచికరమైన కూరలు చేయకుండా విద్యార్థులకి ఇబ్బందిగా మారిన సంబంధిత అధికారులు పట్టించుకోకుండా ఉంటున్నారని ఆయన అన్నారు.

పి డి ఎస్ యు ఆధ్వర్యంలో అనేక సందర్భాల్లో అధికారుల కు చెప్పినప్పటికీ కాలయాపన చేస్తున్నారు కానీ సమస్య మాత్రం పరిష్కారం చేయకపోవడం దారుణమైన విషయమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈరోజు వర్కర్స్ ఎవరు డ్యూటీలోకి రాకుండా ఉండడం కారణంగా విద్యార్థులకు సకాలంలో భోజనం చేయకుండా ఉన్నారని. వర్కర్లపై ప్రిన్సిపల్ దురుసుగా ప్రవర్తించడం వల్ల మేం రాలేదని వర్కర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ఆరు నెలల నుండి వర్కర్స్ కి ప్రిన్సిపాల్ కు మధ్య తరచూ విభేదాలు ఏర్పడిన. ఈ విషయం ఉన్నతాధికారికి తెలిసిన ఏమాత్రం పట్టించుకోకుండా సమస్య పరిష్కారం చేయకుండా విద్యార్థులను ఇబ్బంది పెడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గత ఆరు నెలల నుండి ఈ సమస్యకు పరిష్కారం చేయకుండా కాలయాపన చేస్తున్నారని ఆయన అన్నారు. మెనూ పాటించట్లేదని హాస్టల్లో శుభ్రత కరువైందని అనేక సమస్యలు ఉన్నప్పటికీ సమస్యలు బయటికి తెలియనియకుండా ప్రిన్సిపల్ మీడియా అనే విద్యార్థి సంఘ నాయకుల్ని ఎవరిని రానివ్వకుండా వ్యవహరిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి ప్రిన్సిపల్ ని తక్షణమే సస్పెండ్ చేయాలని ఆయన కోరారు.

## జాతీయ స్థాయి అథ్లెటిక్స్ క్రీడాకారుడికి నేతాజీ వాకర్స్ చేయూత.



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),ఫిబ్రవరి 24,**మణుగూరు జాతీయ స్థాయి అథ్లెటిక్ క్రీడాకారుడు అపక సతీష్ కు మణుగూరు నేతాజీ వాకర్స్ ఆర్థికంగా రూ.10వేలు చేయూత అందించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, దుమ్ముగూడెం మండలం, మారాయిగూడెం గ్రామానికి చెందిన అపక సతీష్ రాష్ట్ర, జాతీయ స్థాయిలో పాల్గొని ప్రతిభ కనబరిచారు. గత నెల జనవరి కేరళ కున్నాంకులం లో నిర్వహించిన అల్ ఇండియా సీనియర్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ 100, 200 మీటర్ల రన్నింగ్ విభాగాల్లో గోల్డ్, లాంగ్ జంప్ విభాగంలో బ్రాంజ్ పతకాలు సాధించాడు. ప్రస్తుతం బెంగుళూరులో జరిగే ఏసియా జాతీయ అథ్లెటిక్ క్రీడల్లో పాల్గొనేందుకు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం నేతాజీ వాకర్స్ టీమ్ దృష్టికి రావడంతో వారు వెంటనే స్పందించి మణుగూరు లోని శ్రీ భార్గవ ఆటోమొబైల్స్ ఎన్ విజయ భాస్కర్ రెడ్డి, రావులపల్లి రామమూర్తి సారధ్యంలో సోమవారం రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా నేతాజీ వాకర్స్ మాట్లాడుతూ అథ్లెటిక్స్ జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీలలో ప్రతిభ కనబరిచి భద్రాద్రి జిల్లాకు, ప్రాంతానికి మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకు రావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మణుగూరు నేతాజీ వాకర్స్ ఎన్ విజయ భాస్కరరెడ్డి, రావులపల్లి రామమూర్తి, తాళ్లపల్లి యాదగిరి గౌడ్, సామ శ్రీనివాస రెడ్డి, కటకం సతీష్, వడ్డాణం రమేష్, మైత్రి శంకర్ రెడ్డి, జొన్నలగడ్డ వెంకటేశ్వరరావు, వాగబోయిన నాగేశ్వరరావు, కొరిమిల్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ అష్టలక్ష్మి యాగం కోసం చేసే 2 ఎకరాల స్థలాన్ని శుభ్రం చేసిన శ్రీ అష్టలక్ష్మి కమిటీ నిర్వాహకులు.

● గుండాల ఎంపీటీసీ గొంగడి వెంకటరామిరెడ్డి



**సీ కే న్యూస్ ఎటపాక ప్రతినిధి, ( సాయి కౌశిక్),ఫిబ్రవరి 24,** అల్లూరి జిల్లా ఎటపాక మండలం శ్రీ సీతారాముల వారు నడయాడిన ఉష్ణ గుండాల సమీపంలో మార్చి 12 నుంచి 23 వరకు శ్రీ అష్టలక్ష్మి యాగం నిర్వహించే 2 ఎకరాల స్థలాన్ని శ్రీ అష్టలక్ష్మి యాగం వ్యవస్థాపకా చార్యులు శ్రీ పీతాంబరం రఘునాథచార్యులు స్వామీజీ వారి ఆధ్వర్యంలో లోక కళ్యాణం కోసం నిర్వహించే ఈ బృహత్తరమైన కార్యక్రమాన్ని శ్రీ అష్టలక్ష్మి యాగ కమిటీ వారు దగ్గరుండి 2ఎకరాల స్థలాన్ని ప్రోక్లైనర్ ద్వారా జామాయిల్ మోట్లను తొలగించి శుభ్రపరిచారు. స్వామీజీ మాట్లాడుతూ, మార్చి రెండవ తేదీ న శ్రీ అష్టలక్ష్మి యాగం నిర్వహించే స్థలము లో 108 జంటలతో, నాగలితో దుక్కిని కదిలించి భూమి పూజ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని అమ్మవారి అనుగ్రహాన్ని పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శ్రీ అష్ట లక్ష్మి పీఠం వ్యవస్థాపకాచార్యులు శ్రీ పీతాంబరం రఘునాథచార్యులు స్వామీజీ, నక్కా భాస్కరరావు ( రిటైర్డ్ డి ఈ పంచాయతీరాజ్ ) గాదె మాధవరెడ్డి ( పట్టణ సంఘ సేవకుడు ) గుండాల ఎంపీటీసీ గొంగడి వెంకటరామిరెడ్డి, ముదునూరి జగన్నాథ రాజ్, రాజేంద్రప్రసాద్, తుమ్మలపల్లి ధనేశ్వరరావు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## పాల్వంచలో ఐదు కేజీల ఎండు గంజాయి స్వాధీనం.

స్వాధీనం చేసుకున్న వారు ఖమ్మం ఎన్ఫోర్స్మెంట్ బృందం.



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్ ),ఫిబ్రవరి 24,** ఖమ్మం ఎన్ఫోర్స్మెంట్ బృందం పాల్వంచ వద్ద రూట్ వాచ్, వెహికల్ చెకింగ్ నిర్వహిస్తూ ఉండగా ఒడిశా నుండి హైదరాబాద్ వరకు ఎండు గంజాయి అక్రమ రవాణా కేసును గుర్తించింది. ఎండు గంజని అక్రమంగా రవాణా చేస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు.

ఏ1, మర్రి సాయి తేజ, నివాసం భద్రాచలం, ఏ2) కట్ల వివేక్ రెడ్డి నివాసం హైదరాబాద్, వారి వద్ద నుంచి ఐదు కేజీల ఎండ గంజాయి, ఒక మోటార్ సైకిల్ రెండు మొబైల్ ఫోన్స్, సుమారు మూడు లక్షలు విలువగల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వారిని తదుపరి విచారణ కొరకు పాల్వంచ పోలీస్ స్టేషన్ నందు అప్పగించారు.

ఈ యొక్క రైడ్లో రమేష్ ఈ ఐ, కరీం హెచ్ సి, సుధీర్ ఈ సి, వెంకట్ ఈసీ, విజయ్ ఈసీ, హనుమంత్ ఈసీ, ఉపేంద్ర ఈసి ఉన్నారు.

# జర్నలిస్టుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి.



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్ ),ఫిబ్రవరి 24,**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రం జిల్లా కలెక్టర్ ఐడిఓసి కార్యాలయం వద్ద తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ టిడబ్ల్యూజెఎఫ్ జిల్లా అధ్యక్షులు పూదోట సూరిబాబు, జిల్లా కార్యదర్శి గుండెబోయిన వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికై నిరసన, అదనపు కలెక్టర్ వేణుగోపాల్ కు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికారుల నిర్లక్ష్యంతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో వర్కింగ్ జర్నలిస్టులకు రెండవ విడత అక్రిడిటేషన్ లు జారీ చేయలేదన్నారు. దాంతో సీనియర్ జర్నలిస్టు సైతం సీనియార్టీని కోల్పోవాల్సి వచ్చిందన్నారు.

రాష్ట్రంలో జర్నలిస్టుల పరిస్థితులు దారుణంగా మారాయని. అనేక ఒడిదుడుకులు మధ్య వృత్తి బాధ్యతలు నిర్వహిస్తున్నారని, చాలీచాలని వేతనాలతో బతుకులీడుస్తున్నారని అన్నారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా ఉండే మీడియాను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని, కనీస సమస్యలను పరిష్కరించ కుండా ఏండ్ల తరబడి జాప్యం చేస్తున్నారని వారన్నారు. ఈనేపథ్యంలో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్త నిరసన కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. అందులో భాగంగా జర్నలిస్టులో ఎదురుకుంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఇండ్ల స్థలాల విషయంలో సర్కారు ప్రత్యేక చొరవ చూపాలని సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో సర్కారు రీవ్యూ పిటిషన్ వేసి వాదనలు చేయాలన్నారు. జర్నలిస్టుల కు అనుకూలంగా తీర్పు వచ్చేలా చర్యలు తీసుకోవాలని. లేకపోతే కొత్త విధానం ద్వారా ఇండ్లస్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

కొత్త ఆరోగ్య భీమా పథకాన్ని ప్రవేశపెట్టాలని, ఉద్యోగుల మాదిరిగా అమలు చేయాలని, జర్నలిస్టుల కంట్రిబ్యూషన్ ను ప్రభుత్వమే భరించాలని, ప్రయివేటు, కార్పొరేట్ ఆస్పత్రుల్లో అమలయ్యేలా చొరవ తీసుకోవాలని, కొత్త అక్రిడిటేషన్ కార్డులను అందజేయడంలో మీడియా అకాడమీ విఫలమైందని ఆరోపించారు. ఇప్పటికే రెండుసార్లు వాయిదా వేసిందని వెంటనే అర్హులైన జర్నలిస్టులందరికీ కొత్త అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వాలని కోరారు. ఇతర రాష్ట్రాల్లో మాదిరిగా రిటైరైన జర్నలిస్టులకు పెన్షన్ పథకాన్ని అమలు చేయాలని, రాష్ట్రంలో జర్నలిస్టులపై దాడులను అరికట్టాలని, ఇందు కోసం ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా ప్రత్యేక రక్షణ చట్టాన్ని తేవాలన్నారు. మహిళా జర్నలిస్టులకు పనిచేసే కార్యాలయం నుంచి ఇంటి వరకు రాత్రి పూట రవాణా సదుపాయం కల్పించాలని,అర్హత ఉన్న చిన్న, మధ్య తరహా పత్రికలు ఎంపానెల్మెంట్లో చేర్చాలని.


జర్నలిస్టుల దయనీయ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని వెంటనే సమస్యలను పరిష్కరించేలా, చర్యలు తీసుకొనేలా ప్రభుత్వానికి సిఫారసు చేయాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిడబ్ల్యూజేఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పూదోట సూరిబాబు, గుండెబోయిన వెంకటేశ్వర్లు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రామిశెట్టి సైదయ్య, రాష్ట్ర కమిటీ సభ్యులు వెలమ రాజేందర్, సీనియర్ పాత్రికేయులు నేరెళ్లకుంట సుధాకర్ రావు, మహిళా పాత్రికేయురాలు మధులిక, పాత్రికేయులు మాణికల సీతయ్య, శివనాగిరెడ్డి, కుంజా వెంకటేష్, ఆకుల శివ, రమేష్, గొడ్డుగొర్ల నాగరాజు, ఎ ఫణి, రబ్బాని, రాందాసు, జీవన్ శివ కుమార్, సుధీర్, రాఘవేందర్ రావు, వీర రాఘవయ్య, భాషిదు జిల్లా కమిటీ సభ్యులు ములకలపల్లి గోపీనాథ్, పర్సబోయిన రాధాకృష్ణ, పాత్రికేయులు తాండ్ర వెంకటరావు, పాల లెనిన్ విజయ్ కుమార్, దూదిమెట్ల కోటేశ్వరరావు, కామేపల్లి నాగరాజు, యానాల మల్లారెడ్డి, దేవరపు శ్రీనివాస్ తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఓబీసీ సెల్ అధ్యక్షున్ని ఘనంగా సన్మానించిన అరూరు గ్రామ నాయకులు.



**సి కె న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజుఫిబ్రవరి 24.** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలోని అరూరు గ్రామంలో ఓబీసీ సెల్ మండల అధ్యక్షులు కనకచారిని ఘనంగా శాలువాతో సన్మానించిన గ్రామ పెద్దలు మాజీ సర్పంచ్ మాజీ ఎంపీపీ చిట్టీడి జనార్ధన్ రెడ్డి జయమ్మ మరియు సింగిల్ విండో చైర్మన్ చిట్టేడి వెంకటరామిరెడ్డి మరియు కాంగ్రెస్ జిల్లా నాయకులు బండారు నరసింహారెడ్డి గ్రామ ప్రజలు పాల్గొని ఘనంగా శాలువాతో సన్మానం చేసినారు.

# గిర్దావర్ -1 గా గణపతి బాధ్యతల స్వీకరణ.



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),ఫిబ్రవరి 24,**పినపాక మండల గిర్ధావర్ 1 గా సి. హెచ్ గణపతి సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో భాద్యతలు స్వీకరించారు. గతంలో ఇదే తహసీల్దార్ కార్యాలయం లో జూనియర్ అసిస్టెంట్ గా విధులు నిర్వహించారు. సోమవారం తాసిల్దార్ అద్దంకి నరేష్ ను కలసి నియామక పత్రాన్ని అందజేసి విధులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా తాసిల్దార్ కార్యాలయం సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.

# సంత్ సేవాలాల్ మహారాజ్ చూపిన మార్గంలో నడవాలి



**సి కే న్యూస్ ఇల్లందు నియోజకవర్గ ప్రతినిధి,ఫిబ్రవరి 24,**గిరిజనుల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహారాజ్ చూపిన మార్గంలో ప్రతి ఒక్కరు నడవాలని ఎంపీ బలరాం నాయక్, ఎమ్మెల్యే కోరం కనకయ్య, ధర్మ గురువు బోజు మహారాజ్ అన్నారు. ఇల్లందు పట్టణంలో సోమవారం సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలు సింగరేణి పాఠశాల క్రీడా మైదానంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంపీ బలరాం నాయక్, ఎమ్మెల్యే కోరం కనకయ్య హాజరై బంజారాల ఆరాధ్య దైవం సేవాలాల్ సేవలు చిరస్మరణీయమని కొనియాడారు.గిరిజనుల అభివృద్ధి కోసం ఎన్నో త్యాగాలు చేసిన సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలు ప్రతి ఏడాది నిర్వహించుకోవడం అభినందనీయమన్నారు. ప్రతిఒక్కరూ ఆయన అడుగుజాడల్లో నడువాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రాంబాబు, సేవాలాల్ సేన రాష్ట్ర గౌరవ అధ్యక్షులు ప్రేమ్చంద్, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ రవి నాయక్, ఏఎంసీ మాజీ చైర్మన్ నాగేశ్వరరావు, మున్సిపల్ మాజీ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు దొడ్డ డేనియల్ లతో పాటు డిఎస్పి చంద్రభాను, తహసిల్దార్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఇల్లెందులో ఆటోలకు కొత్త స్టిక్కర్లు పంపిణీ చేసిన పోలీసులు

**సి కే న్యూస్ ఇల్లందు నియోజకవర్గ ప్రతినిధి,ఫిబ్రవరి 24,**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ ఆదేశంతో ఇల్లందు డిఎస్పి చంద్రభాను సోమవారం ఇల్లెందులోని ఆటోలకు కొత్త స్టిక్కర్లు పంపిణీ చేసారు. ఇల్లందు పట్టణ పోలీసులు ఇల్లందు పట్టణంలో 420 ఆటోలు ఉన్నట్లు గుర్తించారు. ఆటోలు అన్నింటికీ కొత్త స్టిక్కరింగ్ ఇవ్వడం జరిగిందని డిఎస్పి తెలిపారు. ప్రతి ఆటో డ్రైవర్ కు కొత్త నెంబర్ తో పాటు డ్రైవర్, ఓనర్ వివరాలు ఆటో నెంబర్ తో పాటు అన్ని నోట్ చేయడం జరిగిందని తెలిపారు. వారికి ప్రతి అడ్డా నుంచి సీరియల్ ఇవ్వడం జరిగిందని తెలిపారు.ఆటోకి ఇచ్చిన కొత్త నెంబర్ జిల్లాలో ఎక్కడ తిరిగినా ఈ నెంబర్ ని తాము ఈజీగా ఐడెంటిఫై చేసి గుర్తించగలమన్నారు. ప్రతి ఒక్క ఆటో డ్రైవరు కొత్త స్టిక్కర్ను ధరించాలని తెలిపారు. అతిక్రమించిన, ఒకరి



ఆటో ఒకరు నడిపిన చెల్లదని అన్నారు. త్వరలో టేకులపల్లి, బోడు, ఆళ్ళపల్లి, గుండాల, కొమరారం పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆటోలకు కూడా ఇస్తామన్నారు. కార్యక్రమంలో ఇల్లెందు సిఐ బత్తుల సత్యనారాయణ, ఎస్సైలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# షాద్ నగర్ బీసీ సేన సమావేశం విజయవంతం



**నియోజకవర్గ మండలలు మరియు మున్సిపాలిటీ కమిటీల ఎన్నిక**

**నియోజకవర్గం అధ్యక్షులు బీసీ సేన కత్తి చంద్రశేఖరప్ప ఆధ్వర్యంలో**

**ముఖ్య అతిథిగా బిసి సేన జాతీయ అధ్యక్షులు బర్క కృష్ణ**

**సి కే న్యూస్ షాద్ నగర్ :ఫిబ్రవరి 24:** షాద్ నగర్ లోని దేవి గ్రాండ్ హొటల్లో నిర్వహించిన బీసీ సేన నియోజకవర్గంలోని మండలాలు మరియు మున్సిపాలిటీ యొక్క అధ్యక్షులను ఎన్నుకోవడం జరిగింది.ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా బిసి సేన జాతీయ అధ్యక్షులు బర్క కృష్ణ మరియు నియోజకవర్గ అధ్యక్షులు కత్తి చంద్రశేఖరప్ప ఆధ్వర్యంలో అందరు కలిసి నిర్ణయించడం జరిగింది. షాద్ నగర్ ముమున్సిపాలిటీన్సిపాలిటీ అధ్యక్షునిగా తంగేడిపల్లి శంకర్ , ఉపాధ్యక్షుల వరప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా గడ్డమీద రమేష్, మల్కాపురం రవి , వీరమని యాదయ్య ఎన్నికైనారు. నియోజకవర్గం కన్వీనర్ గా పసుపుల సత్యం నియోజకవర్గం ప్రధాన కార్యదర్శిగా భూష%శీ% నరేష్. నియోజకవర్గ కోశాధికారిగా జమాల్పూర్ చందులాల్ నియోజకవర్గ యువజన ఉపాధ్యక్షులు శివ ముదిరాజ్ మరియు చౌదర్ గూడా రామచందర్. నందిగామ మహేష్ ప్రవీణ్ శ్రీను లక్ష్మణ్ మంగలి బసప్ప నరసింహులు శివ నాయక్ రాజుల యాదయ్య బిక్షపతి సత్యం గిరిబాబు శంకర్ గౌతమ్. మల్లేష్ కేశవులు రామచందర్ మహేందర్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడి కేంద్రానికి రెండు ఫ్యాన్లు బహుకరణ

- బహుకరించిన గడిగల కిరణ్ గౌడ్..
- కృతజ్ఞతలు తెలిపిన అంగన్వాడి ఉపాధ్యాయులు.

**సి కే న్యూస్ షాద్ నగర్ :ఫిబ్రవరి 24:** మండుతున్న ఎండల కారణంగా షాద్ నగర్ నియోజకవర్గ ఫరూక్ నగర్ మండలంలోని నాగులపల్లి గ్రామంలో అంగన్వాడి కేంద్రాల్లో ఫ్యాన్లు లేక చిన్నారులు ఇబ్బంది పడుతున్నారని అంగన్వాడి ఉపాద్యాయులు పలువురు దృష్టికి తెచ్చారు.ఈ విషయంపై స్పందించిన గ్రామ యువకుడు కిరణ్ గౌడ్ రెండు అంగన్వాడి కేంద్రాలకు రెండు ఫ్యాన్లను విరాళంగా అందించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ ఉపాధ్యాయులు లతా రెడ్డి, గీత చిన్నారులకు ఎండాకాలం దృష్టిలో పెట్టుకొని వెంటనే స్పందించి ఫ్యాన్లు అందించినందుకు కిరణ్ గౌడ్ కు కృతజ్ఞతలు తెలిపారు...



# ఏప్రిల్ 1 నుండి సింగరేణి వ్యాప్తంగా పేపర్ లెస్ విధానం పై శిక్షణ రెండవ విడత కార్యక్రమం.



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),ఫిబ్రవరి.24,**
సోమవారం జిఎం కార్యాలయ సమావేశం మందిరం లో ఎస్ఓ టు జిఎం డి. శ్యామ్ సుందర్ అధ్యక్షతన ఏప్రిల్ 1 వ తేదీ నుండి సింగరేణి వ్యాప్తంగా అమలు కానున్న పేపర్ లెస్ విధానం పై ఏరియా ఉన్నత అధికారులకు, ఆయా విభాగాల అధికారులకు సింగరేణి కాలరీస్ ఐటిన విభాగం ఆధ్వర్యంలో ఒక రోజు శిక్షణ రెండవ విడత కార్యక్రమం నిర్వహించబడినది.

ఈ కార్యక్రమంలో సీనియర్ ఐటిట్క ప్రోగ్రామర్ సాయిల సురేశ్ మాట్లాడుతూ... ఇప్పటి వరకు సింగరేణి వ్యాప్తంగా ఉత్తర, ప్రత్యుత్తరాలు, సర్క్యులర్ లు, కాగితాల పైన జరుగుతూ ఉన్నాయి. ఇక పై అన్ని రకాల ఉత్తర, ప్రత్యుత్తరాలు ఎస్ ఏ పి ద్వారా మాత్రమే జరగడానికి ఎస్ ఏ పి ఫైల్ మేనేజ్మెంట్ సిస్టమ్ అనే ప్రోగ్రాం ను తయారు చేయడం జరిగింది. దీని వినియోగం వలన సమయం చాలా వరకు ఆదా అవడమే కాక కాగితం వాడకం పూర్తిగా తగ్గించుకోవచ్చు. అందుకే యాజమాన్యం ఈ నిర్ణయం తీసుకొని మొదటి విడుతలో అన్ని ఏరియాల అధికారులకు శిక్షణ ఇవ్వడం జరిగింది. ఈ రోజు నిర్వహించిన రెండవ విడత శిక్షణ కార్యక్రమంలో సంబందిత అధికారుల కు, సిబ్బందికి శిక్షణ ఇవ్వడం జరిగింది. ఈ ప్రక్రియ వల్ల సమాచారం మొత్తం ఆన్లైన్ లో ఎల్లప్పట్టికి భద్రంగా ఉంటుంది కాబట్టి ఇక పై ఈ నూతన విధానాన్నే కొనసాగించాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో డిజిఎం(ఎఫ్, ఏ) ఎం అనురాధా , పికేఓసి సేఫ్టీ అధికారి లింగ బాబు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఈ, ఎం) ఓసిగ స్టోర్స్ ఎం సత్యనారాయణ, డివై.ఎస్ ఈ రామకృష్ణ, సీనియర్ పిఓలు వి రామేశ్వర రావు, ఓంకార్ బాపు, డి.నరేశ్ , ప్రోగ్రామ్మర్(ఐటిల) ఈఆర్పి రమ్య, మేనేజ్మెంట్ ట్రైనీ (సిస్టమ్స్) శ్రీకర్ తేజ మేనేజ్మెంట్ ట్రైనీ ( పర్సనల్) సాయి శ్వేత , ఎస్ చంద్రకిరణ్, అరుణ్ తేజ, వంశీ కృష్ణ మరియు అన్నీ విభాగాల మినిస్ట్రియల్ స్టాఫ్, తదితరులు పాల్గొన్నారు.

# ఈ ఫైలింగ్ విజయవంతం.




**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),ఫిబ్రవరి 24,**
ఈ ఫైలింగ్ 3.0 పై భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో సోమవారం నిర్వహించిన ట్రైనింగ్ ప్రోగ్రాంలో రాష్ట్ర ట్రైనీస్ ముప్పు రవీంద్రారెడ్డి, సాముల రోహిత్ రెడ్డి శిక్షణలో భాగంగా మాట్లాడుతూ ఈ – ఫైలింగ్ ద్వారా కేసులు దాఖలు చేయడానికి డిజిటల్ రూపంలో మార్చే ప్రక్రియను ఆన్లైన్లోనే దావాలు, పిటిషన్లు, డాక్యుమెంట్లు, కోర్టు ఫీజులు, సివిల్ అప్పీలు, ఇతర సివిల్, క్రిమినల్ కేసులు సబ్మిట్ చేయవచ్చని ఇది ఒక ఆధునిక వర్షన్ అని, ఇది మరింత వేగవంతంగా, సురక్షితంగా, సులభంగా, నడిచే ప్రక్రియ అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్, సెషన్స్ జడ్జి మరియు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షుడు పాటిల్ వసంత్, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి జి. భానుమతి న్యామూర్తులు బత్తుల రామారావు, ఏ. సుచరిత, కె. సాయి శ్రీ, లు పాల్గొన్నారు. కొత్తగూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్కినేని సత్యనారాయణ ఉపాధ్యక్షుడు తోట మల్లేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి ఎంఎస్ఆర్ రవిచంద్ర, కార్యవర్గ సభ్యులు సాధిక్ పాషా, ఎస్. ప్రవీణ్ కుమార్ దూదిపాల రవికుమార్, , సీనియర్ జూనియర్ మహిళ న్యాయవాదులు పాల్గొన్నారు.

# రైల్వే స్టేషన్ దగ్గర శిరిడి సాయిబాబా మందిరం 32వ వార్షికోత్సవం.

- కొండూరు అంజయ్య గౌడ్ ఆధ్వర్యంలో.
- అన్నదాత బొడిగె రాజు కుటుంబ సభ్యుల సమక్షంలో.



**సి కె న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు ఫిబ్రవరి 24.**
యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రంలోని రైల్వే స్టేషన్ దగ్గర షిరిడి సాయిబాబా మందిరం 32వ వార్షికోత్సవం, సాయి సేవ మందిరం అధ్యక్షులు కొండూరు అంజయ్య గౌడు ఆధ్వర్యంలో.

32వ వార్షికోత్సవ%శీ% ఘనంగా నిర్వహించినారు, వచ్చిన భక్తులకు అన్నదాన%శీ% బొడిగ రాజు కుటుంబ సభ్యులు ఏర్పాటు చేసినారు, ఈ వార్షికోత్సవంలో సాయి సేవకులు డాక్టర్ దశరథ, కొండూరు సాయి కొండూరు భాస్కర్ కొండూరు నాగేష్ కుటుంబ సభ్యులు,సాయి సేవకురాలు మానస,సాయి సేవక కమిటీ సభ్యులుమండల కేంద్రంలోని సాయి భక్తులు దాదాపు 600 మంది వరకు పాల్గొని షిరిడి సాయి ఆశీస్సులు తీసుకున్నారు పాశం సత్తిరెడ్డి కొండూరు భాస్కర్ కాసుల వెంకన్న సహదేవు సాయిని యాదగిరి కన్నె కంటి రామాచారి కన్నె కంటి శ్రీనివాస్ చారి పంతులు సుంకోజు ఆంజనేయులు చారి,,మీడియాతో బొడిగె రాజు మాట్లాడుతూ అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయడం మా కుటుంబ సభ్యులకు సంతోషంగా ఉన్నదని మాట్లాడినారు,

# పక్కాగా ఇంటర్ పరీక్షల నిర్వహణ

**ఒంగోలు ఫిబ్రవరి 24 సీ కే న్యూస్** ఇంటర్మీడియట్ పరీక్షల ఏర్పాట్లు నిర్వహణలో నిక్షక్ష్యం వహిస్తే బాధ్యులపై కఠిన చర్యలుంటాయని కలెక్టర్ తమీమ్ ఆరారియా హెచ్చరించారు. ఇంటర్మీడియట్ పరీక్షల ఏర్పాట్లు, నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే బాధ్యులపై కఠిన చర్యలుంటాయని కలెక్టర్ తమీమ్ అన్సారియా హెచ్చరించారు. మార్చి ఒకటో తేదీ నుంచి జరగనున్న పరీక్షలపై... ఒంగోలు ఏకేవీకే కళాశాలలో ఆదివారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడారు. ప్రతి కేంద్రంలో సీసీ కెమెరాలు ఉంటాయన్నారు. సమస్యాత్మకంగా గుర్తించిన ఆర్థవీడు, కంభ, గిద్దలూరు, యర్రగొండపాలెం, తురిమెళ్ల తదితర ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలన్నారు. పరీక్షల తీరుపై నకిలీ వార్తలు ప్రచారం చేస్తే క్రిమినల్ చర్యలు తీసుకుంటామన్నారు. చీఫ్ సూపరింటెండెంట్ వద్ద తప్ప ఎవరి వద్దా ఎలాంటి ఫోన్లు ఉండరాదని స్పష్టం చేశారు పరీక్షా సమయం పూర్తయ్యేవరకు విద్యార్థులను హాల్లోనే ఉంచాలని... ముందుగా ఎవరినీ బయటికి పంపరాదని పేర్కొన్నారు. ఏ కేంద్రంలోనైనా అవాంచనీయ సంఘటనలు చోటుచేసుకుంటే అక్కడి అధికారులు, సిబ్బందే బాధ్యత వహించాలన్నారు. ప్రశ్నపత్రాలు ఉంచే స్ట్రాంగ్ రూం వద్ద, స్టోరేజ్ పాయింట్కు తరలించే సమయంలో, సమాధాన పత్రాలు డిపాజిట్ చేసేటప్పుడు తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. ఇంటర్ బోర్డు పరీక్షల నియంత్రణ అధికారి వీవీ సుబ్బారావు మాట్లాడుతూ... ఆన్లైన్లో విద్యార్థుల హాజరు నమోదు చేసేటప్పుడు జాగ్రత్త వహించాలన్నారు. ఒకసారి నమోదైతే సవరణ కష్టమవుతుందన్నారు. మొత్తం 67 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని... విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని అరవో సైమన్ విక్టర్ తెలిపారు. డీఐఈవో ఐ. శ్రీనివాసరావు, డీఈసీ సభ్యులు కె. ఆంజనేయులు, చంద్రశేఖర్, కోటేశ్వరరావు, స్వరూపరాణి పాల్గొన్నారు.


# శివరాత్రి ఉత్సవాలకు అన్నదానం..





**శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 24 సీ కే న్యూస్** మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా పలువురు అన్నదానం కార్యక్రమాలు చేస్తున్నారు. శ్రీకాళహస్తీశ్వరాలయానికి సమీపంలో ఉన్న ఓంకార స్వామి మఠంలో కూడా అన్నదానం ప్రారంభమైంది. ఆశ్రమం పీఠాధిపతి రామస్వామి ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహిస్తున్నారు. చెన్నైకు చెందిన సాయిబాబా మందిరం నిర్వాహకుడు సాయి అవివాలన్, కేరళకు చెందిన 150 మంది స్వాములు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆర్యవైశ్య సంఘం నాయకుడు అయితా మురళీకృష్ణ కూడా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ నెల 28 తేదీ వరకు అన్నదానం కార్యక్రమాలు జరుగుతాయని మఠం పీఠాధిపతి రామస్వామి తెలిపారు...

### కులమతాలకు అతీతంగా విరాజిల్లుతోన్న పవిత్ర పుణ్యక్షేత్రం...రహదారి మాత ఆలయం : మాజీమంత్రి ప్రత్తిపాటి



**చిలకలూరిపేట :ఫిబ్రవరి 24 సీ కే న్యూస్** గ్రామీణ క్రైస్తవుల ఉత్తమమైన భక్తి ఉద్యమంతో ఏర్పడిన అత్యున్నక్షేత్రమే, ఎర్రకొండ రహదారి మాత పుణ్యక్షేత్రమని, అనేక మందికి స్వస్థత ఆశీర్వాదాలు అందిస్తూ, అత్యున్నత ప్రార్థనా క్షేత్రంగా భాసిల్లుతోందని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. యడ్లపాడు మండల కేంద్రంలోని ఎర్రకొండ రహదారి మాత వార్షికోత్సవం సందర్భంగా జరిగిన ప్రార్థనా కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన, బిషప్ చిన్నాబత్తిన భాగ్యరావు ఆశీర్వచనాలు తీసుకున్నారు. దాదాపు 70 ఏళ్ల క్రితం ఏర్పడిన పరమ పవిత్ర పుణ్యక్షేత్రమైన రహదారిమాత క్రైస్తవాలయం, కులమతాలకు అతీతంగా విరాజిల్లుతోందన్నారు. లోకరక్షకుని మాత అయిన మరియతల్లి ఆశీర్వాదాలు ప్రజలందరికీ లభించాలన్నారు. మూడురోజులుగా రహదారి మాత పుణ్యక్షేత్రంలో జరిగిన వార్షికోత్సవ కార్యక్రమాలు క్రైస్తవ భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయని పుల్లారావు తెలిపారు. ఈ సందర్భంగా రహదారిమాత క్షేత్ర నిర్వాహకుల్ని, బిషప్ లకు మాజీమంత్రి ప్రత్యేక అభినందనలు తెలియచేశారు. కార్యక్రమానికి విచ్చేసినందుకు కృతజ్ఞతలు తెలిపిన క్షేత్రనిర్వాహకులు, శాసనసభ్యులు పుల్లారావుగారిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమానంతరం అక్కడ ఏర్పాటుచేసిన అన్నదానాన్ని మాజీమంత్రి ప్రారంభించి, క్రైస్తవ విశ్వాసులకు అన్నవితరణ చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కామినేని సాయిబాబు, రాఘవయ్య, ముత్తవరపు సురేష్, సీతారామయ్య తదితులున్నారు.

# క్వీన్స్ లాండ్ (ఆస్ట్రేలియా) లో కీలక ఖనిజాల ఉత్పత్తి రంగంలో అవగాహన.

- 11 రకాల కీలక ఖనిజాల ఉత్పత్తికి పరస్పర సహకారం.
- తెలంగాణ- క్వీన్స్ ల్యాండ్ ల సంయుక్త మైనింగ్ కు నోడల్ ఏజెన్సీగా సింగరేణి.
- సింగరేణిలో అధికోత్పత్తి, ఆధునిక రక్షణ సాంకేతికత, శిక్షణలో క్వీన్స్ లాండ్ సహకారం క్వీన్స్ ల్యాండ్ రాష్ట్ర ప్రతినిధి బృందంతో జరిగిన సమావేశం.
- రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్కమల్లు.
- కీలక ఖనిజాలు, మైనింగ్ రంగంలో తెలంగాణకు పూర్తి సహకారం - క్వీన్స్ లాండ్ మంత్రి రోస్ బేట్స్.




**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్), ఫిబ్రవరి 24,** భారతదేశంలో కీలక ఖనిజాల మైనింగ్ లో తెలంగాణ రాష్ట్రం ప్రధాన భూమిక పోషించనుందని, ఈ నేపథ్యంలో క్వీన్స్ లాండ్ (ఆస్ట్రేలియా) ప్రభుత్వంతో కీలక ఖనిజాల టెక్నాలజీ, మైనింగ్ రంగంలో పరస్పర సహకారం, భాగస్వామ్యానికి ముందడుగు వేయడం గొప్ప శుభ పరిణామమని, ఇది తెలంగాణ రాష్ట్ర మైనింగ్ చరిత్రలో కీలక మైలురాయిగా నిలిచిపోనున్నదని తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి మరియు ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క మల్లు పేర్కొన్నారు. ఈ విషయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి క్వీన్స్ లాండ్ బృందాని కి తన అభినందనలు తెలియజేశారని పేర్కొన్నారు.

హైదరాబాద్ సింగరేణి భవన్ లో సోమవారం క్వీన్స్ ల్యాండ్ (ఆస్ట్రేలియా) రాష్ట్ర ఆర్థిక, వాణిజ్య, ఉపాధి, శిక్షణ శాఖ మంత్రి రోస్ బేట్స్, మరియు ఆ రాష్ట్ర అధికారుల బృందంతో నిర్వహించిన కీలక ఖనిజాల ఉత్పత్తి, వ్యాపార విస్తరణ అవకాశాల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంతో పాటు దేశంలో విద్యుత్ వాహనాలు సోలార్ విద్యుత్, బ్యాటరీ స్టోరేజ్ సిస్టెమ్ లకు విపరీతమైన డిమాండ్ ఉన్న నేపథ్యంలో ఈ రంగానికి అవసరమైన వనడియం, కోబాల్ట్, ఇండియం, క్రోమియం, టైటానియం వంటి 11 రకాల కీలక ఖనిజాలు ఎంతో అవసరమై ఉన్నాయని, ఇప్పటివరకు ఈ కీలక ఖనిజాలను విదేశాల నుండి దిగుమతి చేసుకుంటున్నామన్నారు. అయితే ఈ ఖనిజాల లభ్యత క్వీన్స్ లాండ్ లో అధికంగా ఉన్నందున వీటి ఉత్పత్తి, విక్రయానికి పరస్పర లబ్ధి చేకూరే వ్యాపార ఒప్పందంపై ప్రాథమికంగా అవగాహనకు వచ్చామన్నారు.

అలాగే తెలంగాణ రాష్ట్రం 2029-30 నాటికి 20,000 వేల మెగావాట్ల గ్రీన్ ఎనర్జీ లక్ష్యాన్ని సాధించడం ద్వారా దేశానికే అదర్శప్రాయంగా నిలవాలని ప్రణాళికలు అమలు జరుపుతోందని, ఈ విషయంలో క్వీన్ లాండ్స్ సహకారం తీసుకునే అవకాశం ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రం మరియు క్వీన్స్ ల్యాండ్ మధ్య సంయుక్త మైనింగ్ మరియు మినరల్ వ్యాపారానికి సింగరేణి సంస్థ ఒక నోడల్ ఏజెన్సీగా నియమిస్తున్నామన్నారు. సింగరేణి సంస్థ ఇప్పటికే క్వీన్స్ లాండ్స్ తో రక్షణకు సంబంధించి సిమ్టార్స్ తో, మైనింగ్ మరియు టెక్నాలజీకి సంబంధించి సి.ఎస్.ఐ. ఆర్.ఓ. తదితర సంస్థలతో ఒప్పందాలు చేసుకొని సేవలు పొందుతుందని, ఇప్పుడు క్వీన్స్ ల్యాండ్ మంత్రి సమక్షంలో కీలక ఖనిజాల వెలికితీత, భారీ ఖనిజ ఉత్పత్తి యంత్రాలు సాంకేతికత, రక్షణ పెంపుదలకు, వెంటిలేషన్ మెరుగుదల, ఎక్కువ లోతులో ఉన్న బొగ్గు నిల్వల తవ్వకానికి సంబంధించి ఆధునిక సాంకేతికత తదితర అంశాలపై పరస్పర అవగాహనతో వ్యాపార ఒప్పందం కోసం ముందుకు పోతుందన్నారు. త్వరలోనే పై అంశాలపై అధ్యయనం మరియు అవగాహన కోసం సింగరేణి నుంచి బృందాన్ని క్వీన్స్ లాండ్ కు పంపుతున్నట్లు తెలిపారు.

ఈ సమావేశంలో క్వీన్స్ ల్యాండ్ ఆర్థిక వాణిజ్య శిక్షణ మరియు ఉపాధి శాఖ మంత్రి రోస్ బేట్స్ మాట్లాడుతూ మైనింగ్ రంగంలో అపారమైన అనుభవం ఉన్న సింగరేణితో ఇప్పటికీ తమతో గల సంబంధాలను మరింత బలోపేతం చేయడానికి ఇక్కడికి రావడం జరిగిందన్నారు. కీలక ఖనిజాలైన కోబాల్ట్, టైటానియం, గ్రాఫైట్, క్రోమియం, టంగ్ స్టన్, యాంటీమోనీ, రీనియం, ఇండియంతో పాటు రేర్ ఎర్త్ మినరల్స్ వంటి కీలక ఖనిజాలను తమతో కలిసి ఉత్పత్తి చేయడానికి ఉమ్మడి భాగస్వామ్యంపై ప్రాథమికంగా అవగాహనకు వచ్చామన్నారు. సౌర విద్యుత్, పవన విద్యుత్ రంగాలలో తమ తరఫున పూర్తిగా సహకరిస్తామన్నారు. తెలంగాణ-క్వీన్స్ లాండ్ రాష్ట్ర తమ మైనింగ్ మరియు మినరల్ వనరుల సద్వినియోగ వ్యాపారాలకు నోడల్ అధికారులను నియమిస్తామని రోస్ బేట్స్ తెలిపారు. మార్చి నెలలో క్వీన్స్ లాండ్ లో పెద్ద ఎత్తున నిర్వహించే వ్యాపార సదస్సుకు రావాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వానికి ఆహ్వానం పలికారు.

ఈ సమావేశానికి సింగరేణి సంస్థ ఛైర్మన్ మరియు ఎండీ ఎన్.బలరామ్ స్వాగతం పలుకుతూ సింగరేణి వ్యాపార విస్తరణ చర్యలు అవకాశాలు అనే అంశంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఆస్ట్రేలియా మంత్రి రోస్ బేట్స్ తో పాటు క్వీన్స్ లాండ్ ప్రభుత్వ చీఫ్ ఆఫ్ స్టాఫ్ మైఖేల్ నెగెర విచ్, వాణిజ్య పెట్టుబడుల చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ జస్టిన్ మెక్ గోవాన్, సౌత్ ఏషియా పెట్టుబడుల సీనియర్ కమిషనర్ అభినవ్ భాటియా, సౌత్ ఏషియా సీనియర్ డైరెక్టర్ మునిష్ కౌశల్, సింగరేణి సంస్థ నుండి డైరెక్టర్ (ఈ అండ్ ఎం), డి.సత్యనారాయణ రావు, డైరెక్టర్ ఆపరేషన్స్ ఎల్.వి. సూర్యనారాయణ, డైరెక్టర్ ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్ కె.వెంకటేశ్వర్లు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కోల్ మూమెంట్, జీఎం కో-ఆర్డినేషన్ ఎస్.డి.ఎం.సుభాని, జనరల్ మేనేజర్ సి. పి. మనోహర్, జనరల్ మేనేజర్ మార్కెటింగ్ డి.రవి ప్రసాద్ పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సమస్యలు పరిష్కరిస్తాం



- జిల్లా కలెక్టర్, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం
- ఇళ్ల స్థలాల అంశం ప్రాసెస్ లో ఉంది..
- గ్రీవెన్స్ కు మీడియాను అనుమతిస్తాం..
- అదనపు కలెక్టర్ పిన్ రెడ్డి శ్రీనివాసరెడ్డి
- టీడబ్ల్యూజేఎఫ్ ఖమ్మ జిల్లా కమిటీ వినతి

**ఖమ్మం:సీ కే న్యూస్** జర్నలిస్టుల సమస్యలను జిల్లా కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్ దృష్టికి తీసుకెళ్లి, సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేలా చూస్తానని అదనపు కలెక్టర్ పిన్ రెడ్డి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. జర్నలిస్టుల ఇళ్ల స్థలాల అంశం ప్రాసెస్ లో ఉందని, దీనిపై ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగిశాక కలెక్టర్ గారి ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్ కు సోమవారం వినతి పత్రం సమర్పించారు.

**ఇవీ సమస్యలు:**

ఇండ్ల స్థలాల విషయంలో సర్కారు ప్రత్యేక చొరవ చూపాలని టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పల్లా కొండల్ రావు, కొత్తపల్లి శ్రీనివాసరెడ్డి కోరారు. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో సర్కారు రీవ్యూ పిటిషన్ వేసి సమస్య సానుకూలంగా పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. లేకపోతే కొత్త విధానం ద్వారా ఇండ్లస్థలాలు ఇవ్వాలన్నారు. కొత్త ఆరోగ్య బీమా పథకాన్ని ప్రవేశపెట్టి, ఉద్యోగుల మాదిరిగా అమలుచేయాలని కోరారు. జర్నలిస్టుల కంట్రిబ్యూషన్ ను ప్రభుత్వమే భరించాలన్నారు. ప్రయివేటు, కార్పొరేట్ ఆస్పత్రుల్లో అమలయ్యేలా చొరవ తీసుకోవాలని కోరారు. కొత్త అక్రిడిటేషన్ కార్డులను అందజేయడంలో మీడియా అకాడమీ విఫలమైందన్నారు. ఇప్పటికే రెండుసార్లు వాయిదా వేసిందని, వెంటనే అర్హులైన జర్నలిస్టులందరికీ కొత్త కార్డులివ్వాలని డిమాండ్ చేశారు. ఇతర రాష్ట్రాల్లో మాదిరిగా రిటైరైన జర్నలిస్టులకు పెన్షన్ పథకాన్ని అమలుచేయాలని కోరారు. రాష్ట్రంలో జర్నలిస్టులపై దాడులను అరికట్టాలని, ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా ప్రత్యేక రక్షణ చట్టాన్ని తేవాలని విజ్ఞప్తి చేశారు. మహిళా జర్నలిస్టులకు పనిచేసే కార్యాలయం నుంచి ఇంటి వరకు రాత్రి పూట రవాణా సదుపాయం కల్పించాలన్నారు. అర్హత ఉన్న చిన్న, మధ్య తరహా పత్రికలు ఎంపానెల్మెంట్లో చేర్చాలని కోరారు. ఖమ్మం జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) శ్రీజా గ్రీవెన్స్ కు ఎలక్ట్రానిక్ మీడియాను అనుమతించక పోవడాన్ని ఆక్షేపించారు. ప్రజా ప్రభుత్వానికి తలవంపులు తెచ్చే ఈ పద్ధతి మార్చుకోవాలని విజ్ఞప్తి చేశారు. జర్నలిస్టుల దయనీయ స్థితులను దృష్టిలో పెట్టుకుని వెంటనే సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వానికి సిఫారసు చేయాలని విజ్ఞప్తి చేశారు. అదనపు కలెక్టర్ కు వినతిపత్రం సమర్పించిన వారిలో టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు గరిడేపల్లి వెంకటేశ్వర్లు, మోహన్ రావు, బాలకృష్ణ, సహాయ కార్యదర్శులు జక్కంపూడి కృష్ణ, నాగుల్ మీరా, నాయకులు పారుపల్లి కృష్ణారావు, బంకా వెంకటేష్, వీసారపు అంజయ్య, చేబ్రోలు నారాయణ, జర్నలిస్టులు ఎస్ కే సుభాను, ఉపేందర్, ధనాలకోట రవికుమార్, వేలాద్రి, ఎల్. వీరారెడ్డి, ఇరుగు వెంకటేశ్వర్లు, పడిశాల మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

# లోక్ అదాలత్ పై న్యాయమూర్తుల, పోలీసుల సమావేశం



**ఖమ్మం:సీ కే న్యూస్** 16వ ఎడిజె పి.ఆంజనేయులు, అసిస్ట్ సెషన్స్ జడ్జి సిఎం రాజ్యలక్ష్మి మరియు 1-వ అడిషనల్ జే ఎఫ్ సి ఎం మేజిస్ట్రేట్ డి.ధీరజ్ కుమార్ ఆధ్వర్యంలో 08.03.2025న లోక్ అదాలత్ గురించి పోలీసు సిబ్బందితో సమావేశం నిర్వహించారు. షాద్‌నగర్ కోర్టులో జరిగిన ఈ సమావేశానికి ఏసీపీ రంగస్వామి, షాద్‌నగర్, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్, కేశంపేట పోలీస్ స్టేషన్, కొందుర్గ్ పోలీస్ స్టేషన్, చౌదరిగూడెం పోలీస్ స్టేషన్, నందిగామ పోలీస్ స్టేషన్, కొత్తూరు పోలీస్ స్టేషన్‌ల స్టేషన్ హౌస్ ఆఫీసర్ హాజరయ్యారు..

# భారత్ పై ట్రంప్ పన్నుల భారం

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 24, :** భారత్ నుంచి అధికంగా ఎగుమతులు జరిగే దేశాల్లో అమెరికా మొదటి స్థానంలో ఉంటుంది. వ్యవసాయ రంగం నుంచి మొదలుకుని ఫార్మా రంగం వరకు.. అనేక రంగాల్లో మన ఉత్పత్తులు అమెరికా మార్కెట్లోకి అడుగు పెడుతున్నాయి. అక్కడ నుంచి మన దేశానికి పెద్ద ఎత్తున ఉత్పత్తులు వస్తున్నాయి. కానీ.. మన పంపించే ఉత్పత్తులపై అమెరికా నామమాత్రపు సుంకాలు విధిస్తుంటే.. భారత్ మాత్రం భారీగా సుంకాలు, టారిఫ్ లు విధిస్తోంది. ఈ విషయమై.. ఇప్పటికే అనేక సార్లు అసంతృప్తి వ్యక్తం చేస్తూ వస్తున్న ట్రంప్.. ప్రతికార పన్నుల విధానాన్ని అమలు చేస్తానంటూ ప్రతీన బూనాడు. అదే జరిగితే.. భారత్ నుంచి అమెరికాకు ఎగుమతి అయ్యే ఉత్పత్తుల ధరలు భారీగా పెరిగిపోతాయని అంచనా వేస్తున్నారు. ఈ టారిఫ్ ల విలువ ఎంతో తెలుసా.. ఏకంగా రూ.61 వేల కోట్లు. అవును.. ఈ మేరకు మన దేశీయ పరిశ్రమలు అదనంగా అమెరికాకు పన్నులు చెల్లించాల్సి ఉంటుంది.ఇటీవల మోదీ పర్యటనలోనూ ప్రతీకార ట్యాక్స్ లు ఉంటాయని తెలిపిన ట్రంప్.. ఏప్రిల్ మొదటి తారీఖున నూతన ట్యాక్సులపై క్లారిటీ ఇస్తానని ప్రకటించారు. దాంతో.. ఏం జరుగునుంది, ఏ విభాగాల్లో ట్యాక్సులు పెరగనున్నాయనే ఆందోళన దేశీయ ఎగుమతిదారుల్లో నెలకొని ఉంది. ఇప్పటి వరకు ఇరు దేశాల మధ్య ఉన్న వాణిజ్య అంతరం, ఇతర ట్యాక్స్ విధించే అవకాశాలున్న ఉత్పత్తుల జాబితాలోని వస్తువుల ఎగుమతుల పరిమాణాన్ని పరిశీలిస్తే.. ఏటా 7 బిలియన్ డాలర్లు అంటే దాదాపు రూ.61,000 కోట్లు.. మన నుంచి ట్రంప్ వసూలు చేసే అవకాశాలున్నాయంటున్నారు. అయితే.. ట్రంప్ నూతన ట్యాక్సులు ప్రకటించాకే.. పూర్తి స్థాయి క్లారిటీ వస్తుందని అంటున్నారు. అప్పుడే.. మన ఎగుమతులపై ఎలాంటి ప్రభావం ఉండనుందో అంచనాలు రాగలుగుతామని ప్రభుత్వ అధికారులు అంటున్నారుఅమెరికా- భారత్ మధ్య వాణిజ్యంలో.. భారతే పై చెయ్యిలో ఉంది. మన దేశం నుంచే అత్యధిక ఎగుమతులు జరుగుతున్నాయి. గతేడాది ఇరుదేశాల మధ్య వాణిజ్యాన్ని పరిశీలిస్తే.. భారత్ నుంచి 74 బిలియన్ డాలర్ల మేర ఉత్పత్తులు అమెరికాలోకి వెళితే.. అక్కడి నుంచి మన దగ్గరకు 42 బిలియన్ డాలర్ల మేర మాత్రమే దిగుమతులు జరిగాయి. అదే తీరుగా.. ట్రంప్ ఆరోపిస్తున్న పన్నుల విధానాన్ని పరిశీలిస్తే.. మన దేశం అమెరికా ఉత్పత్తులపై సరాసరి 11 శాతం టారిఫ్ వసులూ చేస్తుండగా, అమెరికాలోమాత్రం 2.8 శాతమే కావడం గమనార్హం. రెండు దేశాల మధ్య టారిఫ్ వ్యత్యాసం 8.2% అధికం గా ఉండడమే ట్రంప్



ఆగ్రహానికి కారణం.

ఇక విభాగాల వారీగా పరిశీలిస్తే.. భారత్ నుంచి వివిధ రసాయనాలు, లోహ ఉత్పత్తులు, ఆర్నమెంట్లు, ఆటోమొబైల్, ఫార్మా, ప్రాసెసింగ్ ఫుడ్ రంగాలపై ఎక్కువగా ప్రభావం పడనుంది. కాగా.. అభరణాల విభాగంలో.. ముత్యాలు, రత్నాభరణాలు వంటివే అత్యధికంగా.. 8.5 బి. డాలర్ల మేర ఉత్పత్తులు అమెరికాకు పంపించాము. ఆ తర్వాత అత్యధికంగా ఫార్మా 8 బి.డా, పెట్రో రసాయన ఉత్పత్తులు 4 బి.డా మేర ఎగుమతి అయ్యాయి. ఇక.. అమెరికా నుంచి మన దేశానికి వచ్చిన ఉత్పత్తుల్లో చెక్క ఉత్పత్తులు, మెషినరీ ఐటమ్స్ పై 7%, పాదరక్షలు, రవాణా సామగ్రిపై 15-20% శాతం పన్నులు వసూలు చేసిన భారత్.. ఆహార వస్తువులపై 68% శాతం టారిఫ్ లను రాబట్టింది. దేశీయ ఆహార పరిశ్రమను రక్షించుకునేందుకు ఇలా.. భారీ సుంకాల్ని అమలు చేస్తున్నట్లు చెబుతున్నారు. కానీ.. ఇరువైపుల నుంచి చూసినప్పుడు ఇది ఆమోదయోగ్యం కాదు అంటున్నారు.. అమెరికన్ అధికారులు.ఇక.. ఈ రంగాల కంటే వ్యవసాయ ఉత్పత్తులు, మోటార్ సైకిళ్లపై విధిస్తున్న పన్నులపై ట్రంప్ తీవ్ర ఆగ్రహంగా ఉన్నారు. అత్యంత ప్రాధాన్య దేశం (ఎమ్ఎఫ్ఎన్) కింద మన వ్యవసాయ ఉత్పత్తులపై అమెరికా కేవలం 5% టారిఫ్ నే వసూలు చేస్తోంది. కానీ.. మనదేశం మాత్రం అమెరికా నుంచి వచ్చే వ్యవసాయ ఉత్పత్తులపై ఏకంగా 39% పన్నులు రాబడుతోంది. అలాగే.. అమెరికా మోటార్ సైకిళ్లపై అయితే 100% సుంకం అమలు చేస్తూ.. దిగుమతుల్ని నియంత్రించేందుకు శతవిధాల ప్రయత్నాలు చేస్తోంది. ఇదే సందర్భంలో.. మన దేశం నుంచి అమెరికాకు ఎగుమతి అయ్యే మోటార్ సైకిళ్లపై అమెరికా 2.4% టారిఫ్ మాత్రమే విధిస్తున్నట్లు వాషింగ్టన్ స్పష్టం చేస్తోంది. ఇలా.. అనేక రకాల వివాదాలున్న నేపథ్యంలో.. ట్రంప్ ప్రతీకార టారిఫ్ లను విధిస్తే.. మన ఎగుమతిదారులకు మరింత భారం తప్పదు అంటున్నారు. ఈ పరిస్థితుల నుంచి తప్పించుకునేందుకు అమెరికాతో వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోవడం మేలని అంటున్నారు.

# అక్కడ కెసిఆర్.. ఇక్కడ జగన్...

**హైదరాబాద్, ఫిబ్రవరి 24, :** రెండు తెలుగు రాష్ట్రాల్లో రాజకీయాలు శరవేగంగా మారుతున్నాయి. ముఖ్యంగా ప్రతిపక్షాలు అలెర్ట్ అవుతున్నాయి. విపక్ష నేతలు బయటకు రావడం ప్రారంభించారు. అధికార పార్టీతో తేల్చుకునేందుకు సిద్ధపడుతున్నారు. దీంతో తెలుగు రాష్ట్రాల్లో రాజకీయాలు వేడెక్కుతున్నాయి. తెలంగాణలో అధికారాన్ని కోల్పోయారు కేసీఆర్. అయితే ఓటమి తర్వాత ఆయన పెద్దగా యాక్టివ్ గా లేరు. సుమారు 14 నెలల అనంతరం ఆయన పార్టీ కార్యాలయానికి వచ్చారు. సమీక్షలు మొదలుపెట్టారు. ఏపీలో సైతం జగన్మోహన్ రెడ్డి జనం బాట పడుతున్నారు. పార్టీ నేతల పరామర్శతో పాటు గుంటూరు మిర్చి యార్డు రైతులను పరామర్శించారు. ఉగాది నుంచి ప్రజాక్షేత్రంలో అడుగు పెట్టాలని చూస్తున్నారు. అయితే ఆ ఇద్దరు నేతలు ఆరు నెలల వ్యవధిలోనే అధికారాన్ని కోల్పోవడం విశేషం.వరుసగా రెండుసార్లు తెలంగాణలో అధికారంలోకి వచ్చారు కెసిఆర్. 2014లో జరిగిన తొలి ఎన్నికల్లో విజయం సాధించింది కేసీఆర్ నేతృత్వంలోని టీఆర్ఎస్. 2018లో సైతం రెండోసారి అధికారంలోకి రాగలిగింది. 2023 ఎన్నికల్లో మాత్రం ఆ పార్టీ ఓడిపోయింది. కాంగ్రెస్ పార్టీ గెలిచింది. 14 నెలల అనంతరం కెసిఆర్ పార్టీ కార్యాలయానికి వచ్చారు. పార్టీ నేతలతో మాట్లాడారు. వారిలో ధైర్యం నింపే ప్రయత్నం చేశారు. కాంగ్రెస్ పార్టీలో వర్గ విభేదాలు, ప్రభుత్వ వైఫల్యాలతో ఆ పార్టీ గ్రాఫ్ పడిపోయిందని.. వచ్చేది బిఆర్ఎస్ ప్రభుత్వమని తేల్చి చెప్పారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వానికి ఇంకా మూడున్నర ఏళ్ల కాలం ఉంది. తప్పులు సరిదిద్దుకునేందుకు సమయం కూడా ఉంది. అయితే కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకత్వం బలహీనం కావడం, తెలంగాణ కాంగ్రెస్ లో సైతం వర్గాలు నడుస్తుండడంతో కెసిఆర్ మరింత యాక్టివ్ అవుతున్నారు.ఏపీలో సైతం జగన్మోహన్ రెడ్డి చాలా రకాలుగా యాక్టివ్ అవుతున్నారు. పార్టీ నుంచి పెద్ద ఎత్తున నేతలు బయటకు వెళ్తున్నారు. అయితే వారి స్థానంలో కొత్త నియామకాలు చేపడుతున్నారు. పార్టీ నేతలపై దాడులతో పాటు కేసులను



ప్రశ్నిస్తున్నారు. ఉగాది నుంచి ప్రజాక్షేత్రంలో అడుగు పెట్టాలని చూస్తున్నారు. ఎట్టి పరిస్థితుల్లో 2029 ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం వస్తుందని తేల్చి చెబుతున్నారు. అయితే ఇక్కడ కూడా టిడిపి కూటమికి నాలుగేళ్ల సమయం ఉంది. ఆపై అపర చాణిక్యుడు చంద్రబాబు ఉన్నారు. అంత ఈజీ కాదని తెలిసినా జగన్మోహన్ రెడ్డి మాత్రం పార్టీ శ్రేణుల్లో ఒక రకమైన ధైర్యం పెంచే ప్రయత్నం చేస్తున్నారు.అయితే ఒకేసారి స్నేహితులిద్దరూ తెరపైకి రావడం చర్చకు దారితీస్తోంది. వీరిద్దరూ పరస్పర రాజకీయ ప్రయోజనాలు చేసుకున్న వారే. కానీ ఇద్దరు తమ సొంత రాష్ట్రాల్లో ఓడిపోయారు. భారీ అంచనాలతో రంగంలోకి దిగి చతికిల పడ్డారు. అయితే ఇప్పుడు ఒకేసారి ఇద్దరు క్రియాశీలకం కావడం మాత్రం చర్చకు దారితీస్తోంది. ఒక ప్రత్యేక వ్యూహంతోనే ఇద్దరు ఒకేసారి జర్నీ ప్రారంభించినట్లు అర్థమవుతోంది. చూడాలి వారి వ్యూహం ఎంతవరకు ఫలిస్తుందో.

# బాలీవుడ్ కు లైఫ్ ఇచ్చిన చావా

**ముంబై, ఫిబ్రవరి 24, :** బాలీవుడ్ లో ఇటీవలే భారీ అంచనాల నడుమ విడుదలైన 'చావా' చిత్రం బాక్స్ ఆఫీస్ వద్ద సృష్టిస్తున్న ప్రకంపనలు సృష్టిస్తున్నాయి, పుష్ప 2 తర్వాత బాలీవుడ్ బాక్సాఫీస్ మరోసారి వెలిగిపోతుంది. ఛావా సినిమాకు కలెక్షన్ల వర్షం కురుస్తుంది. విక్కీ కౌశల్ హీరోగా లక్ష్మణ్ ఉటేకర్ తెరకెక్కించిన ఈ సినిమా బాక్సాఫీస్ దగ్గర సంచలన వసూళ్లు సాధిస్తుంది. 3 రోజుల్లోనే 100 కోట్ల క్లబ్బులో చేరిపోయింది ఛావా. ఈ దూకుడు చూస్తుంటే 400 కోట్లు ఈజీనే అనిపిస్తుంది.. ఛత్రపతి శంభాజీ మహారాజ్ వీరోచిత గాథను డైరెక్టర్ లక్ష్మణ్ అద్భుతంగా చూపించడంతో ఈ సినిమాకి నార్త్ ఇండియన్స్ బ్రహ్మరథం పడుతున్నారు. ముఖ్యంగా హీరో విక్కీ కౌశల్ అద్భుత నటన ప్రేక్షకుల చేత కన్నీళ్లు పెట్టించేలా చేసింది. కచ్చితంగా ఈ సినిమాతో ఆయన నేషనల్ అవార్డుని అందుకున్నా ఆశ్చర్యపోనక్కర్లేదని చూసిన ప్రతీ ఒక్కరు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. మొదటి వారంలో 247 కోట్ల రూపాయిల నెట్ వసూళ్లను రాబట్టిన ఈ సినిమా, రెండవ వారం లోనూ అదే తరహా జోరుని కనబరుస్తూ ముందుకు దూసుకుపోతుంది. 9వ రోజు ఈ చిత్రానికి కేవలం బుక్ మై షో యాప్ నుండి 9 లక్షల టిక్కెట్లు అమ్ముడుపోయాయి. కేవలం 'పుష్ప 2' కి తప్ప ఈ రేంజ్ టికెట్ సేల్స్ ఇప్పటి వరకు ఏ సినిమాకి జరగలేదు.. ఇప్పుడు సీన్ చూస్తుంటే పుష్పని కూడా చావా క్రాస్ చేస్తుందని టాక్ నడుస్తోంది.బాక్స్ ఆఫీస్ వసూళ్లు అయితే 9వ రోజు దాదాపుగా 44 కోట్ల రూపాయిల నెట్ వసూళ్లు వచ్చాయట. ఇది సాధారణమైన విషయం కాదు. ఇక పదవ రోజు అయితే బుక్ మై షో యాప్ లో దాదాపుగా 10 లక్షల టిక్కెట్లు అమ్ముడుపోయాయని టాక్. ఇండియా వెర్సస్ పాకిస్తాన్ క్రికెట్ మ్యాచ్ ఉన్నప్పటికి ఈ రేంజ్ వసూళ్లు అంటే ఆడియన్స్ లో ఈ సినిమాకి ఉన్నటువంటి మౌత్ టాక్ ఎలాంటిదో అర్థం చేసుకోవచ్చు. అక్కడి ట్రేడ్ పండితులు అందిస్తున్న ముందస్తు సమాచారం ప్రకారం ఈ సినిమాకి పదవ రోజు 60 కోట్ల రూపాయిల నెట్ వసూళ్లు వచ్చే అవకాశాలు ఉన్నాయట. మొత్తం మీద 9 రోజులకు 293 కోట్ల రూపాయిల నెట్ వసూళ్లను రాబట్టిన ఈ సినిమా, పది రోజులకు గాను 353 కోట్ల రూపాయిల నెట్ వసూళ్లను రాబడుతుందని అంటున్నారు.ఇప్పట్లో ఈ సినిమా వసూళ్లు తగ్గేలా కనిపించడం లేదు. వచ్చే వారం తో ఈ సినిమా 500 కోట్ల రూపాయిల క్లబ్ లోకి చేరనుంది. అయితే ఈ సినిమా తెలుగు వెర్షన్ రిలీజ్ కి డిమాండ్ మామూలు రేంజ్ లో లేదు. మన ఆడియన్స్ మేకర్స్ ని ట్యాగ్ చేసి, కచ్చితంగా ఈ సినిమాని తెలుగు లో రిలీజ్ చేయాలనీ ప్రతీ రోజు ట్విట్టర్ లో డిమాండ్ చేస్తూనే ఉన్నారు. గతేడాది స్త్రీ 2 తర్వాత మరే హిందీ సినిమాకు వందల కోట్ల వసూళ్లు రాలేదు. బాలీవుడ్ మళ్లీ గాడి తప్పుతుందా అనుకుంటున్న సమయంలో ఛావాకు వస్తున్న వసూళ్లు చూసి ఊపిరి పీల్చుకుంటున్నారు దర్శక నిర్మాతలు. ఈ ఊపు రాబోయే సినిమాలకు ఉపయోగపడితే అదృష్టమే. త్వరలోనే సికిందర్‌తో రాబోతున్నారు సల్మాన్ ఖాన్. తెలుగు లో ఈ సినిమాని రిలీజ్ చేయడానికి మేకర్స్ సిద్ధంగా ఉన్నారని, ఈ చిత్రానికి తెలుగు వెర్షన్ లో జూనియర్ ఎన్టీఆర్ డబ్బింగ్ చెప్తాడని, రాజమౌళి ప్రొమోషన్స్ లో పాల్గొంటాడని, ఇలా ఎన్నో రకాల రూమర్స్ ఉన్నాయి. వీటికి సంబంధించి అధికారిక ప్రకటన ఇంకా రావాల్సి ఉంది. ఒకవేళ తెలుగు లో రిలీజ్ చేస్తే ఫుల్ లో రన్ మరో వంద కోట్ల రూపాయిల గ్రాస్ అదనంగా రావొచ్చు.

## పక్కదారి పడుతున్న రేషన్ బియ్యం




**వరంగల్, ఫిబ్రవరి 24,** తెలంగాణలో రేషన్ బియ్యాన్ని పక్కదారి పట్టిస్తున్న కొందరు కేటుగాళ్లు వాటిని బీర్ల తయారీ కంపెనీలకు పంపుతూ సొమ్ము చేసుకుంటున్నారు. రేషన్ బియ్యాన్ని నేరుగా పంపితే, సోదాల్లో దొరికిపోతామని తెలివిగా వాటిని నూకలుగా మార్చుతున్నారు.అనంతరం తెలంగాణ సహా మహారాష్ట్ర, కర్ణాటకలోని బీర్ల తయారీ సంస్థలకు పంపిస్తున్నారు. దొడ్డు బియ్యంలో గంజి శాతం ఎక్కువగా ఉంటుంది. అలాగే, అది మిగతా పదార్థాలతో కలిసి త్వరగా పులుస్తుంది. దొడ్డు బియ్యం తక్కువ ధరకు కూడా దొరుకుతుండడంతో బెవరేజస్ సంస్థలు ఈ బియ్యాన్ని అధికంగా కొంటున్నాయి.ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పలు ప్రాంతాల్లోని రేషన్ బియ్యాన్ని రాత్రి సమయంలో నూకలుగా చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో 225 ఇటువంటి కేసులు గత ఏడాది నమోదయ్యాయి. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోనూ ప్రతి ఏడాది దాదాపు 150 కేసులు నమోదవుతున్నాయి.ఇటువంటి పనులకు పాల్పడుతున్న వారిలో దళారులుగా ఉన్నవారిలో అత్యధికులు రౌడీషీటర్లే. మరోవైపు, ఉమ్మడి కరీంనగర్ జిల్లాల్లోనూ ఇటువంటి తతంగమే నడుస్తోంది. బీర్ల కంపెనీలకు తరలించడం కోసం.. కొందరు దొడ్డు బియ్యాన్ని ఎలా సేకరిస్తున్నారో తెలిస్తే ఆశ్చర్యపోవాల్సిందే.రేషన్ నుంచి దొడ్డు బియ్యం అవసరం లేదని కొందరు లబ్ధిదారులు అనుకుంటారు. వారి నుంచి కిలోకు రూ.10 చొప్పున చెల్లించి కొంటున్నారు. వాటిని మిల్లర్లకు కిలోకు రూ.15 నుంచి రూ.18 చొప్పున అమ్ముతున్నారు. వాటిని మిల్లర్లు నూకలుగా చేయించి బెవరేజస్ కంపెనీలకు రూ.25 నుంచి రూ.35 మధ్య అమ్ముకుంటున్నారు

## ప్రసన్న హరికృష్ణకు తమ మద్దతు

**పెద్దపల్లి ప్రతినిధి:** ట్టమద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రసన్న హరికృష్ణకు తమ మద్దతు తెలుపుతున్నట్లు ప్రైవేట్ టీచర్స్, లెక్చరర్స్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు నారమళ్ళ విజయ్ కుమార్ తెలిపారు. పెద్దపల్లి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రసన్న హరికృష్ణను గెలిపించాలని తెలిపారు. గత ఐదు నెలలుగా మంచిర్యాల, చెన్నూరు, బెల్లంపల్లి, రామగుండం, పెద్దపల్లి, మంథనిలోని గురువులతో సమావేశాలు నిర్వహించి, అందరి అభిప్రాయాలతో తమ మద్దతు ప్రసన్న హరికృష్ణకేనని నిర్ణయించామన్నారు. ప్రైవేట్ గురువులకు ఉద్యోగ భద్రత, ఆరోగ్య భద్రత కల్పిస్తామని ప్రసన్న హరి కృష్ణ హామీ ఇవ్వడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు విజయ్ కుమార్ అన్నారు. ఈనెల 27 న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రైవేటు గురువులందరూ, ప్రసన్న హరికృష్ణకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని విజయ్ కుమార్ కోరారు.

## అసెంబ్లీ నుంచి వైసీపీ వాకౌట్



**విజయవాడ:** ఏపీ శాసనసభ సమావేశాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ముందుగా గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రసంగించారు.ఆదే సమయంలో సభలో వైఎస్సార్సీపీ సభ్యులు ఆందోళనకు దిగారు. "అసెంబ్లీలో ప్రతిపక్షాన్ని గుర్తించండి. ప్రజల గొంతుక వినిపించాలంటే ప్రతిపక్ష హోదా ఇవ్వాల్సిందే" అంటూ నిరసనకు దిగారు. తరువాత గవర్నర్ ప్రసంగాన్ని వ్యతిరేకిస్తూ సభ నుంచి వాకౌట్ చేశారు. ప్రతిపక్షంగా గుర్తించాలని గవర్నర్ ప్రసంగం సమయంలో వైసీపీ సభ్యుల నినాదాలు చేసారు. జగన్మోహన్ రెడ్డి, వైసీపీ సభ్యులు దాదాపు పదకొండు నిమిషాల పాటు అసెంబ్లీలో నినాదాలు చేసి వెళ్లిపోయారు.

## గవర్నర్ కు ఘన స్వాగతం

**తాడేపల్లి:** : బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఉభయసభలను ఉద్దేశించి గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రసంగించారు. అంతకుముందు అసెంబ్లీకి చేరుకున్న గవర్నర్కు సభాపతి అయ్యన్నపాత్రుడు, మండలి ఛైర్మన్ మోషేన్ రాజు, , సీఎం చంద్రబాబు నాయుడు స్వాగతం పలికారు. ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, , మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరయ్యారు.

CK NEWS చంద్ర కాంత్ తెలుగు దినపత్రిక

# నాదెండ్ల మీద నారాజ్ గా ఉన్నారా?

ఏపీ మంత్రి నాదెండ్ల మనోహర్ మీద జనసేన కీలక నేతలు ఆగ్రహంగా ఉన్నారా? అంటే అవుననే అనిపిస్తుంది. పదవులు విషయానికి వచ్చేసరికి పవన్ కల్యాణ్ తమను పట్టించుకోకపోవడానికి నాదెండ్ల మనోహర్ చేస్తున్న డైరెక్షన్ కారణమని పలువురు నేతలు నేరుగానే ఆరోపిస్తున్నారు. కొందరు జనసేన కార్యకర్తలు అయితే తాము పవన్ కు అభిమానులమని, జనసేన బలోపేతం చేయడానికి పనిచేస్తామని, కానీ నాదెండ్ల మాత్రం అందుకు విరుద్ధంగా పనిచేస్తూ తనకు అనుకూలంగా ఉన్న వారి పేర్లను మాత్రమే పవన్ కు సిఫార్సు చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. కొందరు నేతలు ఇప్పటికే రాజీనామాలు చేయగా,మరికొందరు తమ రాజీనామాలకు కారణం చెప్పకుండా అధికారంలో ఉండి కూడా పక్కకు తప్పుకుంటున్నారు.

**సోషల్ మీడియాలో...**

ఇది ప్రధానంగా పవన్ కల్యాణ్ పై ఉన్న అసంతృప్తి కన్నా నాదెండ్ల మనోహర్ పైనే అని పార్టీలో సీనియర్ నేత ఒకరు తెలిపారు. నాదెండ్ల మనోహర్ జనసేనలో ఉంటూ తెలుగుదేశం పార్టీ కోవర్టుగా పనిచేస్తున్నారని పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన ఒక కాపు నాయకుడు సోషల్ మీడియాలో పెట్టిన పోస్టు వైరల్ గా మారింది. నాదెండ్ల మనోహర్ కు పవన్ కల్యాణ్ ఇస్తున్నప్రాధాన్యతను చూసి తాము మాట్లాడలేకపోతున్నామని, గతంలో ఆయన వల్ల ఎంత మంది నేతలు పార్టీని వదిలిపెట్టారన్న విషయం అందరికీ తెలుసునని మరికొందరు గుర్తు చేస్తున్నారు. నామినేటెడ్ పోస్టుల్లోనూ తమకు ఇవ్వడం లేదని, పార్టీ పదవుల్లోనూ తమకు అన్యాయం జరుగుతుందని వారు ఆరోపిస్తున్నారు.

**నమ్మకమైన నేతగా...**

కానీ నాదెండ్ల మనోహర్ తొలి నుంచి పవన్ కల్యాణ్ కు నమ్మకమైన నేతగా ఉన్నారు. ఆయన రాజకీయ జీవితంలో ఇప్పటి వరకూ ఒక్క మచ్చపడకూడా పడలేదు. అవినీతి ఆరోపణ కూడా లేదు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో స్పీకర్ గా పనిచేసిన నాదెండ్ల మనోహర్ చాలా బ్యాలన్సడ్ గా పనిచేశారన్న ప్రశంసలు అందుకున్నారు. అందుకే పవన్ కల్యాణ్ ఇటు రాజకీయ అనుభం, అటు నీతిమంతమైన పొలిటికల్ కెరీర్ ను చూసి ఆయన చెప్పినట్లు నడుచుకుంటున్నారనే వారు కొందరున్నారు. అయితే జిల్లాల్లో పెత్తనం చేస్తున్నారన్న ఆరోపణలపై పవన్ కల్యాణ్ ఆదేశాలను మాత్రమే నాదెండ్ల అమలు చేస్తారంటున్నారు. అందుకే ఆయనపై ఎవరెన్ని ఫిర్యాదులు చేసినా పవన్ కల్యాణ్ లైట్ గానే తీసుకుంటారన్నారు.

**నెంబరు టూగా...**

జనసేనలో ఎవరు అవునన్నా కాదన్నా నాదెండ్ల మనోహర్ నెంబర్ 2 అని చెప్పక తప్పదు. నాగబాబు పార్టీలో ఉన్నప్పటికీ ఆయనకు రాజకీయ అనుభవం లేకపోవడంతో నాదెండ్ల చెప్పిన రూట్ లోనే పవన్ వెళతారు. అలాగని రాంగ్ డైరెక్షన్స్ ఇచ్చే పని చేయరు. పవన్ ప్రతిష్టకు మచ్చ తెచ్చే విధంగా ఎలాంటి సలహా ఇవ్వరు. పవన్ మనస్తత్వం తెలిసిన నాదెండ్ల మనోహర్ అందుకు అనుగుణంగానే నడుచుకుంటారు. టీడీపీతో సమన్వయం చేసినా అచ్చుగుద్దినట్లు పవన్ చెప్పిన విషయాలను మాత్రమే చెప్పి వస్తారు కానీ అక్షరం పొల్లు పోనివ్వరని కూడా సీనియర్ నేతలు చెబుతుంటారు. అందుకే ఆయనకు అన్ని రకాల ముఖ్యమైన బాధ్యతలను పవన్ అప్పగిస్తారని, ఎవరు ఎన్ని గింజుకున్నా నాదెండ్ల మనోహర్ పై పవన్ ఈగ వాలనివ్వరన్నది మాత్రం అందరూ గుర్తుంచుకుంటే మంచిదని సూచిస్తున్నారు.

# ప్రొటీన్ ఎక్కువ తీసుకుంటున్నారా..? అయితే ఈ సమస్యలు వస్తాయి.. జాగ్రత్త..!




మానవుని శరీరానికి ప్రోటీన్లు చాలా అవసరం. వీక్ గా ఉన్నప్పుడు కానీ.. ఏవైనా ఆరోగ్య సమస్యలు ఉన్నప్పుడు గానీ డాక్టర్లు ప్రొటీన్లు ఉండే పదార్థాలు వాడాలని సూచిస్తారు. శరీరానికి అవసరమైన సూక్ష్మపోషకాల్లో ప్రోటీన్ ఒకటి. ప్రోటీన్ అమైనో ఆమ్లాలుగా విచ్ఛిన్నం కావడం వల్ల శరీరంలో కండరాల పెరుగుదలకు సహాయపడుతుంది. దీనితో పాటుగా ఇది హార్మోన్లను నియంత్రిస్తుంది. అలాగే న్యూరోట్రాన్స్మిటర్లు, రోగనిరోధక పనితీరుకు కూడా చాలా అవసరమవుతుంది. అయితే ప్రొటీన్లు ఎక్కువగా వాడటం వల్ల ఎలాంటి అనారోగ్య సమస్యలు వస్తాయో తెలుసుకుందాం. ముఖ్యంగా ప్రొటీన్లు ఎక్కువగా కలిగిన ఆహారం తింటే బరువు తగ్గొచ్చని డాక్టర్లు చెబుతుంటారు. కానీ అలాంటి ఆహారం తిన్నప్పుడు స్వల్పంగా అయితే బరువు తగ్గుతారు.. కానీ భవిష్యత్ లో మళ్లీ బరువు పెరగడానికి ఆస్కారం ఉంటుంది. ఎందుకంటే శరీరంలో కొవ్వువలే ఎక్కువ ప్రోటీన్ నిల్వ ఉండటంతో.. అమైనో ఆమ్లాల పరిణామం పెరుగుతుంది. దీంతో మళ్లీ బరువు పెరిగేందుకు ఛాన్స్ ఉందంటున్నారు ఆరోగ్య నిపుణులు. జంతువులతో వచ్చే ప్రోటీన్ తీసుకుంటూ, ఆహారంలో పండ్లు, కూరగాయలు వంటి ఫైబర్ ఎక్కువగా ఉండే మొక్కల ఆహారాన్ని తీసుకోకపోతే.. మీకు మలబద్ధకం సమస్య వచ్చే అవకాశం ఉంది. అలాగే ఉబ్బరం వంటి ఇతర జీర్ణ సమస్యలు కూడా వస్తాయి. అంతేకాకుండా ప్రోటీన్లు అధికంగా తీసుకోవడం వల్ల నోటి నుంచి దుర్వాసన వస్తుంది. ముఖ్యంగా కార్బోహైడ్రేట్లను బాగా తగ్గించినప్పుడు వాసన మరింత ఎక్కువవుతుంది. ఫైబర్ లేని పాలు, ప్రాసెస్ చేసిన ఆహారాన్ని ఎక్కువ మొత్తంలో తీసుకుంటుంటే మీకు విరేచనాల సమస్య వచ్చే అవకాశం ఉంది.

అయితే ఒక వ్యక్తి వారి వయస్సు, లింగం, శరీర బరువు, శరీర కూర్పు, శారీరక శ్రమపై ఆధారపడి ఉంటుంది. ఒక వ్యక్తి శారీరక శ్రమలో పాల్గొనకపోతే.. వారు వారి శరీర బరువులో కిలోగ్రాముకు కనీసం 0.8 గ్రాముల ప్రోటీన్ ను క్రమం తప్పకుండా తీసుకోవాలి. మీరు రోజులో 1 గంట పాటు వ్యాయామాలు చేస్తే మీ శరీరంలోని 3 కిలోలకు 1.2 నుంచి 1.7 గ్రాముల ప్రోటీన్ ను తీసుకోవాలంటూ ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.



# తిండి విషయంలో ఈ తప్పులు చేయొద్దు!

## మానవాళి ఆరోగ్యంపై తిండి అలవాట్ల ప్రభావం

## ఆహారపు అలవాట్లు ఆరోగ్యాన్ని నిర్దేశిస్తాయంటున్న పరిశోధకులు

## మధ్యాహ్న భోజన విషయంలో జాగ్రత్తగా ఉండాలని సూచన

మానవుల ఆరోగ్యాన్ని ప్రభావితం చేసే అనేక అంశాలలో తిండి అలవాట్లు కూడా ముఖ్యమైనవే. ఆహారపు అలవాట్లు వ్యక్తుల ఆరోగ్యాన్ని నిర్దేశిస్తాయని పరిశోధకులు అంటున్నారు. తిండి విషయంలో చేసే కొన్ని తప్పులు చిన్నవే అయినా దీర్ఘకాలంలో చేటు చేస్తాయని, ప్రమాదకర జబ్బులకు దారితీస్తాయని చెబుతున్నారు. ఆహారం విషయంలో కొన్ని అలవాట్లకు దూరంగా ఉండాలని, ముఖ్యంగా మధ్యాహ్న భోజనం విషయంలో జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నారు. అవేంటో చూద్దాం...

ఉదయం అల్పాహారం తినకుండా మధ్యాహ్న భోజనం పీకల దాకా లాగించడం
తిన్నవెంటనే పనిచేయడం
మంచినీరు తక్కువగా తీసుకోవడం
పిచ్చిపట్టినట్టుగా తినడం
నిర్దిష్ట సమయం అంటూ లేకుండా ఎప్పుడంటే అప్పుడు లంచ్ చేయడం.
మధ్యాహ్న భోజన సమయంలో కనీసం స్నాక్స్ అయినా తీసుకోకపోవడం
లంచ్ లో ఎప్పుడూ జంక్, ప్రాసెస్డ్ ఫుడ్ తినడం
మధ్యాహ్నం భోజనం చేయాల్సిన సమయంలో టీ, కాఫీలు తాగడం
హడావిడిగా తినడం
పోషక విలువలున్న ఆహారానికి లంచ్ లో చోటివ్వకపోవడం
లంచ్ కు ఓ ప్రణాళిక అంటూ లేకపోవడం
మధ్యాహ్న భోజనంలో సమతుల ఆహారం తీసుకోకపోవడం

ఈ అలవాట్లన్నీ అప్పటికప్పుడేమీ ప్రభావం చూపవు, కానీ నిదానంగా ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయి మొదట్లో వీటి లక్షణాలు ఓ మోస్తరుగానే అనిపించినా, కాలక్రమంలో కోలుకోలేనంతగా నష్టం వాటిల్లుతుంది.

సరైన రీతిలో మధ్యాహ్న భోజనం చేయకపోతే శరీరం తగినంత మోతాదులో కీలక విటమిన్లను, ఖనిజలవణాలను స్వీకరించలేదు. అస్తవ్యస్త భోజన సమయాలు మొదట జీర్ణవ్యవస్థను నాశనం చేస్తాయి. దాంతో ఉదరంలో జీర్ణరసాల ఉత్పత్తిలో సమతుల్యత ఉండదు. మొదట్లో చిన్న సమస్యలే అనుకున్నవి ఆ తర్వాత తీవ్రస్థాయికి చేరతాయి.

ప్రధానంగా, సక్రమమైన తిండి అలవాట్లు లేకపోతే మధుమేహం బారినపడే ముప్పు ఎక్కువ. సరైన సమయంలో ఆహారం తీసుకోకపోవడం, మధ్యాహ్న భోజనం వరకు పరగడుపునే ఉండడం శరీరంలో ఇన్సులిన్ స్థాయిలను కుదుపులకు గురిచేస్తాయి. దాంతో బ్లడ్ సుగర్ హెచ్చుతగ్గులకు లోనవుతుంది.

ఇక, కొన్ని రకాల ఆహార పదార్థాలు క్యాన్సర్ కు దారితీస్తాయి. ఒబేసిటీతో పాటు 13 రకాల క్యాన్సర్లకు అనారోగ్యకర ఆహారమే కారణమని పరిశోధకులు గుర్తించారు. మెనింజియోమా, థైరాయిడ్, అడెనోకార్సినోమా, ఈసోఫేగస్, మల్టీపుల్ మైలోమా, కిడ్నీ, యూట్రస్, ఓవరీ, లివర్, గాల్ బ్లాడర్, ఉదరం, ప్యాంక్రియాస్, బ్రెస్ట్ క్యాన్సర్ లకు అనారోగ్యకరమైన తిండికి సంబంధం ఉందని అనేక అధ్యయనాలు చెబుతున్నాయి.

మధ్యాహ్న భోజనంలో బలమైన పోషకాహారం తీసుకోకపోతే గుండె బలహీనపడుతుంది. అదే సమయంలో గుండె ఆరోగ్యంగా ఉండాలంటే ఉప్పు మోతాదు మించరాదు. ప్రతిరోజు పెద్దవాళ్లు 2,300 ఎంజీ కంటే ఎక్కువ ఉప్పు తీసుకోరాదు. అయితే ప్రస్తుతకాలంలో ప్యాకేజ్డ్ ఫుడ్స్ రూపంలో మనకు తెలియకుండానే ఉప్పు అధికంగా తీసుకుంటున్నాం. ఆరోగ్యకరమైన ఆహారానికే ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా సోడియం వినియోగాన్ని నియంత్రించవచ్చు.

# బాలయ్య హీరోయిన్ సొగసైన ప్రదర్శన



# హాఫ్ షోల్డర్ గౌనులో రాశీ కిరాక్



ఇటీవల తెలుగు ఫిలింసర్కిల్స్ లో రాశీఖన్నా సందడి కొంత తక్కువగానే ఉంది. ప్రస్తుతం ఈ భామ ముంబై పరిశ్రమలో సినిమాలు, వెబ్ సిరీస్ లలో అవకాశాలు అందుకుంటోంది. తెలుగులో సిద్ధు జొన్నలగడ్డతో కలిసి %-%తెలుసు కదా%-% చిత్రంలో నటించనుంది. అభిమానులు ఈ చిత్రం కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.మరోవైపు రాశీ తన అభిమానులను నిరంతరం సోషల్ మీడియాల ద్వారా పలకరిస్తూనే ఉన్నారు. రాశీ వరుస ఫోటోషూట్లను షేర్ చేస్తూ ఫ్యాన్స్ ని ఇన్‌స్టాలో యంగేజ్ చేస్తున్నారు. తాజాగా ఈ దిల్లీ బ్యూటీ షేర్ చేసిన ఓ ఫోటోగ్రాఫ్ అంతర్జాలంలో వైరల్ గా మారుతోంది.రాశీ అందమైన ఆఫ్ షోల్డర్ డిజైనర్ ఫ్రాక్ ని ధరించింది. ఇది థై స్లిట్ ఎలివేషన్‌కి సహకరించే ఫ్రాక్. రాశీ ఈ బ్లాక్ డ్రెస్ లో ఎంతో స్టన్నింగ్ గా కనిపిస్తోంది. సింపుల్ గా మేకప్ లెస్ లుక్ లో కనిపించిన రాశీ చిరునవ్వుతో ఫోటోషూట్ కి ఫోజులిచ్చింది. రాశీ బ్లాక్ గౌన్ తన అందాన్ని పదింతలు పెంచిందని చెప్పాలి. ప్రస్తుతం ఈ స్పెషల్ ఫోటోగ్రాఫ్ యువతరంలో వైరల్ గా మారుతోంది.ఇటీవలే స్టార్ బోయ్ సిద్దు జొన్నలగడ్డతో తెలుసు కదా? పోస్టర్లు విడుదలయ్యాయి. సిద్ధూతో రాశీ కెమిస్ట్రీ ఓ రేంజులో వర్కవుటైందని ప్రశంసలు కురుస్తున్నాయి. పోస్టర్ లో లవ్ ఇంటిమేట్ లుక్స్ యూత్ ని టీజ్ చేసాయి. రాశీ కొంత గ్యాప్ తర్వాత మరో యువహీరోతో ఘనంగా తన కంబ్యాక్ ని చాటుకునే పనిలో ఉంది. వ్హాట్ విల్ హ్యాపెన్స్ వెయిట్ అండ్ సీ.

## సోనాల్ తన దీపావళి గ్లోను చూపిస్తుంది



# పూజ బేబీ మాస్టర్ ప్లాన్ అదేనా..!



అదేంటో చిత్రంగా బుట్ట బొమ్మ పూజా హెగ్డేకి చేతిలో సినిమాలు పెద్దగా లేకపోయినా సరే టీవీ ఆన్ చేస్తే చాలు అమ్మడు దర్శనమిస్తుంది. అదెలా సాధ్యం అనుకుంటున్నారా.. సినిమాల కన్నా అమ్మడు ఈమధ్య ఎక్కువగా వాణిజ్య ప్రకటనలల్లో కనిపిస్తుంది. పూజా హెగ్దే యాడ్స్ బాగా ట్రెండింగ్ లో ఉంటున్నాయి. ప్రస్తుతం అమ్మడు మజా, గార్నియర్, సౌత్ ఇండియా షాపింగ్ మాల్ యాడ్స్ చేస్తుంది. ఈ యాడ్స్ ద్వారా తన ఫ్యాన్స్ అండ్ ఫాలోవర్స్ ని అలరిస్తుంది పూజా హెగ్దే.తెలుగులో రాధే శ్యాం తర్వాత ఒక్కటంటే ఒక్క ఛాన్స్ కూడా అందుకోలేదు. గుంటూరు కారం నుంచి ఆమె ఎగ్జిట్ అవ్వడమే ఆమెకు శాపంగా మారింది. అదేంటో మొన్నటిదాకా తెలుగులో ప్రతి స్టార్ సినిమాలో పూజానే హీరోయిన్ అన్న రేంజ్ నుంచి అమ్మడికి ఒక్క సినిమా ఛాన్స్ కూడా ఇవ్వలేనంత విధంగా గ్రాఫ్ పడిపోయింది. ఐతే కెరీర్ పరంగా డీలా పడాల్సిన అవసరం లేదని భావిస్తున్న పూజా హెగ్దే వాణిజ్య ప్రకటనల ద్వారా ప్రేక్షకులను అలరిస్తుంది.సౌత్ లో టాప్ ప్లేస్ దాకా వెళ్లిన పూజా హెగ్దే బాలీవుడ్ లో కూడా లక్ కలిసి రాక ఇబ్బంది పడుతుంది. ప్రస్తుతం దేవ అనే సినిమా చేస్తున్న పూజా బేబ్ నెక్స్ట్ సినిమా ఛాన్స్ ల కోసం ఆసక్తిగా ఎదురుచూస్తుంది. పూజా హెగ్దే గ్లామర్ ట్రీట్ ని మిస్ అవుతున్న ఆడియన్స్ ఆమెను త్వరగా వెండితెర మీద చూడాలని ఆశిస్తున్నారు. పూజా ఫ్యాన్స్ మాత్రం ఆఫర్లు లేట్ గా వచ్చినా అమ్మడు మళ్లీ తిరిగి కంబ్యాక్ అందుకుంటుందని ఆశిస్తున్నారు.ప్రస్తుతం కోలీవుడ్ లో సూర్య సరసన ఒక సినిమా చేస్తున్న పూజా హెగ్దే ఆ సినిమాతో అక్కడ క్రేజ్ తెచ్చుకోవాలని చూస్తుంది. సూర్య 44 మాత్రమే కాదు దళపతి విజయ్ నెక్స్ట్ సినిమాలో కూడా అమ్మడు లక్కీ ఛాన్స్ పట్టేసింది. మొత్తానికి తెలుగు పరిశ్రమ దూరం పెట్టినా సరే కోలీవుడ్ నుంచి పూజాకి వరుస అవకాశాలు వస్తున్నాయి.విజయ్ తో బీస్ట్ తర్వాత మళ్లీ జత కడుతున్న పూజా హెగ్దే సూర్య, విజయ్ సినిమాల మీద చాలా హోప్స్ పెట్టుకుంది. మొన్నటిదాకా టాలీవుడ్ లో టాప్ లేపిన అమ్మడు కోలీవుడ్ లో కూడా తన మేనియా కొనసాగిస్తుందేమో చూడాలి. ఐతే చేస్తున్న సినిమాల ఫలితాల మీదే ఆమె నెక్స్ట్ ఆఫర్లు డిపెండ్ అయ్యి ఉంటాయని చెప్పొచ్చు.